ప్రతిపక్షం
www.prathipaksham.in
శనివారం 28.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 339 పేజీలు:8 | ₹5
@prathipaksham | prathipaksham tv telugu



వన్డే సిరీస్ చేజార్చుకున్న వుమెనిండియా 8



ఢిల్లీ మద్యం కేసులో
కవితకు క్లీన్ చీట్

ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కీలక తీర్పు

సరైన ఆధారాలు లేవని సీబీఐ అభియోగాలన్ని కొట్టివేత

- ఆప్ అధినేత కేజ్రీవాల్, మనీష్ సిసోడియాతో పాటు 23 మందికి విముక్తి
- కీలక అంశాలను కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు
- కొన్ని ముఖ్యమైన సాక్ష్యాలను విస్మరించింది
- ఢిల్లీ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసిన సీబీఐ

"ఈ దేశంలో న్యాయవ్యవస్థపై నేను పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముకాకుండా కాపాడింది. మేము ముందు నుంచి ఏదైతే తెలంగాణ ప్రజలకు చెబుతూ వచ్చామో అదేవిధంగా ఇవాళ కోర్టు అందరినీ నిర్దోషులుగా విడుదల చేయడం జరిగింది. రాజకీయపరంగా కేసు పెట్టారని నేను పదే పదే చెప్పిందే నిజమైంది. కడిగిన ముత్యంలా బయటకు వస్తానని నేను ఇంతకు ముందే చెప్పాను. అదేవిధంగా రావడం జరిగింది. నేను జైలులో ఉన్న సందర్భంలో కార్యకర్తలు అనేక సార్లు వారి సొంత డబ్బులు ఖర్చు చేసి ఢిల్లీకి వచ్చి నాకు, నా కుటుంబానికి అండగా నిలబడ్డారు. వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

- కవిత, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు

నేను అవినీతిపరుడిని కాదు. మేం నిజాయితీపరులని కోర్టు చెప్పింది. నేడు ఈ కేసులోని నిందితులందరినీ కోర్టు విడుదల చేసింది. నిజం గెలుస్తుందని మేం ఎప్పుడూ చెబుతుంటాం. భారత న్యాయ వ్యవస్థపై మాకు పూర్తి నమ్మకం ఉంది. అమిత్ షా, మోదీ కలిసి ఆప్‌ను అంతం చేయడానికి అతిపెద్ద రాజకీయ కుట్రను పన్నారు. మా పార్టీకి చెందిన ఐదుగురు పెద్ద నాయకులను జైలులో పెట్టారు. కేజ్రీవాల్ అవినీతిపరుడు కాదు. నా జీవితంలో నేను నిజాయితీని మాత్రమే సంపాదించుకున్నాను. నేడు కేజ్రీవాల్, మనీశ్ ఆప్ నిజాయితీపరులని కోర్టు పేర్కొంది.

– ఆప్ అధినేత కేజ్రీవాల్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, నాయకుడు మనీష్‌సిసోడియాతో పాటు 23 మందికి ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం క్లీన్ చీట్ లభించింది. శుక్రవారం ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కీలక తీర్పును వెలువరించింది. కవితపై సీబీఐ అభియోగాలకు సంబంధించి సరైన ఆధారాలు లేవని కోర్టు అభిప్రాయపడింది. ఈ కేసును విచారించిన సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి జితేందర్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. కవితతో పాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న వారిపై సీబీఐ నమోదు చేసిన అభియోగాలన్నిటిని రౌస్ అవెన్యూ కోర్టు కొట్టివేసింది. సీబీఐ సహా దర్యాప్తు సంస్థ దాఖలు చేసిన ఛార్జిషీటులో నిందితులు తప్పు చేశారని నిరూపించడానికి తగిన సాక్ష్యాధారాలు లేవని న్యాయమూర్తి స్పష్టం చేశారు. దాదాపు మూడేళ్లపాటు కొనసాగిన ఢిల్లీ లిక్కర్ పాలసీ స్కామ్ కేసులో కోర్టు తీర్పు కవితతో పాటు ఈ కేసులో ఉన్న మిగతా 22 మంది నిందితులకు కూడా ఈ ఉత్తర్వులతో ఊరట లభించినట్లయింది. కోర్టు తీర్పు అనంతరం పలువురు కవిత

...:: మిగతా 2లో

కడిగిన ముత్యంలా వచ్చా..



- కోర్టు తీర్పును స్వాగతిస్తున్నా
- న్యాయ వ్యవస్థకు కృతజ్ఞతలు
- కేసు కారణంగా ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా
- ఎన్ని కోట్లు ఇచ్చినా అవమానం తీరదు
- బీఆర్ఎస్ ఓటమికి నేను కారణమా?
- ఓటమిని నా మెడలో వేయాలని చూస్తే ప్రజలు హర్షించరు
- కేటీఆర్ నిజాలు చెప్పాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

చిటుకుల మైసారెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 27: 'ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసు తప్పుడు కేసు అని మొదటి నుంచి చెబుతూ వచ్చానని, కడిగిన ముత్యంలా బయటకు వస్తా అన్నాను. కోర్టు తీర్పుతో అదే జరిగింది అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. కేసులో ఉన్న వారందరికీ క్లీన్ చిట్ రావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా భారత న్యాయ వ్యవస్థకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసు తీర్పు అనంతరం సంచలన వ్యాఖ్యలు చేశారు. రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, సభ్యులను కలిసి శుక్రవారం గద్వాల, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల రైతుల సమస్యలపై వినతిపత్రం అందజేసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ కేసు కారణంగా ఐదున్నర నెలలు పిల్లలు, కుటుంబానికి దూరంగా ఉండాల్సి రావడం వల్ల ఎన్నో అవమానాలు, బాధ, వ్యక్తిత్వ హననం ఎదుర్కోవాల్సి వచ్చింది అని కవిత వాపోయారు. ఎన్ని కోట్లు ఇచ్చినా అవమానం తీరదన్నారు. ఆ సమయం తిరిగి రాదని, తన కుటుంబానికి అన్యాయం జరిగిందనేది వాస్తవమన్నారు. కష్ట కాలంలో తన పక్కన నిలిచిన తల్లిదండ్రులు, అత్తమామలు, భర్త, ఆయన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి వాయిదాకి వచ్చి నైతిక స్థైర్యం ఇచ్చిన కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలని అన్నారు.

కేటీఆర్ చేసిన ట్వీట్‌పై ఆగ్రహం

కోర్టు తీర్పు వచ్చిన తర్వాత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ట్వీట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఒకవైపు కంగ్రాట్స్

...:: మిగతా 2లో

గద్వాల్ సీడ్ పత్తి రైతులను ఆదుకోవాలి

- కరీంనగర్ తరహాలో ఎకరానికి రూ.75 వేల చెల్లించాలి
- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి వినతి
- సీడ్ ఫెయిల్ అయితే కంపెనీలు బాధ్యత వహించాలి
- లోటు పాట్లు సవరించి, సీడ్ చట్టం తీసుకురావాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

...:: 2లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ – 6.27 (శనివారం సాయంత్రం)

సహర్ – 5.14 (ఆదివారం ఉదయం)



బబ్బర్ షేర్ ను ప్రజలు చెప్పలతో కొట్టారు

ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పి నిరసన చేయడాన్ని ప్రధాని నరేంద్రమోదీ తప్పుబట్టారు. కాంగ్రెస్ ఎన్ని కుతంత్రాలు చేసినప్పటికీ తమ ప్రభుత్వం దేశ అభివృద్ధికి కృషి చేస్తూనే ఉంటుందని మోదీ అన్నారు.

7



బీజేపీకి ఎక్కువ సీట్లొస్తే రాజకీయాల నుండి తప్పకుంటా

తక్షణం ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించాలని, బీజేపీకి 10 కంటే ఎక్కువ సీట్లు వస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పకొంటానని మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ అన్నారు.

7



లిక్కర్ పాలసీపై కోర్టు తీర్పును అంగీకరించాలి

లిక్కర్ పాలసీపై ఢిల్లీ కోర్టు ఇచ్చిన తీర్పును అంగీకరించాలని సామాజిక కార్యకర్త అన్నా హజారే అన్నారు. అరవింద్ కేజ్రీవాల్‌కు కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంపై ఆయన స్పందించారు.

7

మద్యం కేసు వల్లే బీఆర్ఎస్ ఓటమి పాలైంది

- కుంభకోణం పేరుతో ఢిల్లీలో ఆప్ ప్రభుత్వాన్ని కూల్చారు
- కవితకు కోర్టులో న్యాయం జరిగింది
- మిగిలిన నాయకులపై ఉన్న తప్పుడు కేసులు కూడా వీగిపోతాయి
- మా నాయకులపై పెట్టిన ప్రతి కేసు రాజకీయ కక్షలో భాగమే
- ప్రజల విశ్వాసం ఇప్పటికీ బీఆర్ఎస్ పైనే ఉంది
- 'ఎక్స్' వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



...:: 2లో



హింస వల్ల ఏ సమస్యకూ పరిష్కారం లభించదు

- ప్రజల ఆకాంక్షలు ప్రజాస్వామ్య మార్గంలోనే నెరవేరుతాయి
- ప్రజాస్వామ్యంపై నమ్మకంతో వెనక్కి రావడం అభినందనీయం
- ప్రభుత్వం తరపున పూర్తి రక్షణ కల్పిస్తాం
- పునరావాస కల్పనలో ఎటువంటి లోటు లేకుండా చూస్తాం
- మాజీ మావోయిస్టు అగ్ర నేతలతో ముఖ్యమంత్రి భేటీ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 27 : జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ మావోయిస్టు అగ్రనేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సచివాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారి అభ్యర్థన మేరకు ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి వారితో

...:: మిగతా 2లో

జీఐ అనేది మన చరిత్ర, గుర్తింపు

- జీఐ ట్యాగ్స్ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి
- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- బస్సులపై జీఐ ఆర్ట్ తెలంగాణ సంస్కృతిపై అవగాహన తెస్తుంది
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- బస్సులపై వినూత్నంగా జీఐ ట్యాగ్ ఉన్న కళాకృతులు
- జీఐ ఆర్ట్ వర్క్ ఉన్న ఆరు ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రారంభం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 27 : జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ అనేది మన చరిత్ర, గుర్తింపు, సంప్రదాయమని, జీఐ ట్యాగ్స్ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని గవర్నర్ జిష్ణు దేవ్ అన్నారు. తెలంగాణ ఆర్టీసీ 'జీఐ ఆన్ వీల్స్' పేరుతో దేశంలోనే మొట్టమొదటిసారిగా

...:: మిగతా 3లో



జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో కోర్ అర్బన్ చట్టం

- వ్యవహారాలన్నింటికి ఆ చట్టమే ఆధారంగా ఉండాలి
- ఫ్యూచర్ సిటీలో ప్రభుత్వ కార్యాలయాల పనులు వేగవంతం చేయండి
- ఓఆర్ఆర్ లోపల రోడ్లన్నింటిని ఎంఏయూడీ పరిధిలోకి తేవాలి
- చెరువులు, కుంటల అభివృద్ధి, సుందరీకరణ చేపట్టాలి
- ఎంఏయూడీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

...:: 3లో



రాష్ట్రీయం

మద్యం కేసు వల్లే బీఆర్ఎస్ ఓటమి పాలైంది

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 27 : 'మద్యం కుంభకోణం పేరుతో ఢిల్లీలో ఆప్ ప్రభుత్వాన్ని కూల్చారు. ఈ కుంభకోణం కారణంగానే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలైంది. ఇవాళ కవితకు అనుకూలంగా వచ్చిన తీర్పుతో న్యాయం జరిగింది. మా నాయకులపై పెట్టిన ప్రతి కేసు రాజకీయ కక్షలో భాగమే. నిజాలు బయటకు రానంత కాలం కాంగ్రెస్, భాజపా దుష్ప్రచారాలను చూస్తూనే ఉంటాయి' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవితకు క్లీన్ చీట్ ఇస్తూ వచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ నడిగడ్డలో మాత్రం ప్రజల విశ్వాసం ఇప్పటికీ బీఆర్ఎస్ పైనే ఉందని కేటీఆర్ అన్నారు. నడిగడ్డ స్ఫూర్తి రాష్ట్రం మొత్తం వ్యాపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ వ్యవస్థల తీరును ఎండగట్టారు. సాక్ష్యాల కంటే ఆరోపణలకే ప్రాధాన్యత ఇస్తున్నారని, మీడియా ట్రయల్స్ ద్వారా తప్పుడు ప్రచారం చేశారని ఆయన మండిపడ్డారు. న్యూ ఇండియాలో ఆధారాలు లేకుండానే రాజకీయ నేతలను అప్రతిష్టపాలు చేయడం ఒక అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. కవితకు కోర్టులో న్యాయం జరిగిందని, భవిష్యత్తులో మిగిలిన నాయకులపై ఉన్న తప్పుడు కేసులు కూడా వీగిపోతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కోర్టు తీర్పు కవితకు వ్యక్తిగతంగా ఊరటనిచ్చినప్పటికీ, అన్నాచెల్లెళ్ల మధ్య తలెత్తిన ఈ వాగ్వాదం బీఆర్ఎస్ పార్టీ క్యాడర్‌లో గందరగోళానికి దారితీస్తోంది. ఒకవైపు రాజకీయ విజయం సాధించామనే సంతోషం ఉన్నా, మరోవైపు ఓటమికి బాధ్యత ఎవరిదనే విషయంలో కుటుంబం, పార్టీలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవ్వడం చర్చనీయాంశంగా మారింది. కవిత రెండు నెలల్లో పార్టీ పెట్టబోతున్నారు. ఈ క్రమంలో ఆమెను బలపరిస్తే, అది పార్టీకి నష్టమని వీలైనంత వరకూ బీఆర్ఎస్ నేతలు మౌనం పాటిస్తున్నారు.

కడిగిన ముత్యంలా వచ్చా..

మొదటిపేజీ తరువాయి

చెబుతూ, మరోవైపు పార్టీ ఓటమికి ఈ కేసే కారణమని ట్వీట్ చేయడం ఏమిటి? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా కూడా పార్టీ ఓటమికి ఈ కేసే కారణమని ట్విస్ట్ ఇస్తోందన్నారు. "బీఆర్ఎస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడానికి నేను కారణమా? ప్రజలు ఒకసారి ఆలోచించాలి" అని కోరారు. బీఆర్ఎస్ ఓటమికి అసలు కారణాలు వేరేనని పేర్కొన్నారు. ఉద్యోగాలు ఇవ్వకపోవడం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వాగ్దానాలు నెరవేర్చకపోవడం, దోపిడీదారులకు టికెట్లు ఇవ్వడం, అన్నింటికంటే అహంకారం కారణంగా పార్టీ ఓడిపోయిందన్నారు. "ఓటమిని నా మెడలో వేయాలని చూస్తే ప్రజలు హర్షించరు. కేటీఆర్ వాస్తవాలు అంగీకరించి ఎక్కడ తప్పు జరిగిందో సమీక్షించుకోవాలి" అని సూచించారు. తాను జైలుకు వెళ్లిన సమయంలో పార్టీ పెద్ద నాయకులు ఎవరూ ప్రెస్ మీట్ పెట్టలేదని, కనీసం సోషల్ మీడియాలో సపోర్ట్ కూడా లేకుండా ఒంటరిగా ఎదుర్కోవాల్సి రావడం బాధాకరమన్నారు. బీజేపీ సోషల్ మీడియా తనపై తప్పుడు ప్రచారం చేస్తూ, బతుకమ్మ స్థానంలో లిక్కర్ బాటిల్ ఎత్తుకున్నట్లు చిత్రీకరించిందని అవేదన వ్యక్తం చేశారు. అప్పుడు బీఆర్ఎస్ సోషల్ మీడియా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. "బీజేపీ చేసిన తప్పుడు ప్రచారాన్ని ఎదుర్కోవడంలో బీఆర్ఎస్ విఫలమైంది. అప్పుడు బీజేపీ మాట్లాడిందే ఇప్పుడు బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారు అంటే ఇద్దరూ ఒక్కటేనా?" అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. "నాకు సోషల్ మీడియా ఆర్మీ లేదు. ఒక ఆడబిడ్డ కష్టంలో ఉన్నప్పుడు అవమానించిన వారికి తగిన సమయంలో ప్రజలే బుద్ధి చెబుతారు" అని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్ సింగ్, ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, ఇస్మాయిల్ సయ్యద్, రాష్ట్ర కార్యదర్శి భవానీ వేముల, నడిగడ్డ హక్కుల పోరాట సమితి చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్, కన్వీనర్ బుచ్చిబాబు, రైతు జాగృతి అధ్యక్షుడు నవీన్ రెడ్డి, నరేష్, శ్రావణి, సుధాకర్ తదితరులు కవిత వెంట ఉన్నారు.

హింస వల్ల ఏ సమస్యకూ పరిష్కారం లభించదు

మొదటిపేజీ తరువాయి

సుదీర్ఘంగా చర్చించారు. హింస వల్ల ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం లభించదని, ప్రజల ఆకాంక్షలు కేవలం ప్రజాస్వామ్య మార్గంలోనే నెరవేరుతాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారితో అన్నారు. దశాబ్దాల పాటు అడవుల్లో గడిపిన వారు తిరిగి ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకంతో వెనక్కి రావడం అభినందనీయమని పేర్కొంటూ, వారు సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు ప్రభుత్వం తరఫున పూర్తి రక్షణ, పునరావాస కల్పనలో ఎటువంటి లోటు లేకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. పొరుగు రాష్ట్రాల్లో అమలవుతున్న పునరావాస విధానాలను పరిగణనలోకి తీసుకుని, సాదరణ జీవితం గడిపేందుకు ముందుకు వచ్చిన వారికి మరింత మెరుగైన ప్యాకేజీని అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, కె. కేశవరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, రాష్ట్ర డీజేపీ బి. శివధర్ రెడ్డి , ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీపీ విజయ్ కుమార్, ఎస్ఐబి (ఇంటెలిజెన్స్) ఐజీపీ బి. సుమతి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో మావోయిస్టుల పునరావాస పురోగతిని ముఖ్యమంత్రికి వివరిస్తూ, గత రెండేళ్లలో ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 591 మంది మావోయిస్టులు జనజీవ స్రవంతిలో కలిసి సాధారణ పౌరులుగా జీవిస్తున్నారని డీజీపీ బి.శివధర్ రెడ్డి తెలిపారు. పోలీసు శాఖ సమన్వయ కృషి, ప్రభుత్వం అమలు చేస్తున్న మెరుగైన పునరావాస విధానాల వల్ల అగ్రనేతల్లో సైతం మార్పు వచ్చిందని ఆయన వివరించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మాజీ మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యులు , పొలిట్ బ్యూరో సభ్యుడు తిపిరి తిరుపతి అలియాస్ దేవుజీ అలియాస్ రమేష్ అలియాస్ సంజీవ్ అలియాస్ చేతన్ అలియాస్ కుమ్మ దాదా (సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఇన్‌చార్జ్), మాజీ సెంట్రల్ కమిటీ సభ్యులు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, పుల్లూరి ప్రసాద్ రావు అలియాస్ శంకరన్న అలియాస్ చంద్రన్న అలియాస్ సోమన్న, పోతుల పద్మావతి అలియాస్ కల్పన అలియాస్ మైనాబాయి అలియాస్ మైనక్క అలియాస్ సుజాతలతో పాటు మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు బడే చొక్కారావు అలియాస్ దామోదర్ (తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి), నూనే నర్సింహారెడ్డి అలియాస్ గంగన్న అలియాస్ రాహుల్ అలియాస్ సన్ను ఉన్నారు. సాయుధ పోరాటాన్ని వీడి ప్రధాన స్రవంతిలోకి వచ్చేందుకు అవకాశం కల్పించినందుకు వారు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అత్యంత స్నేహపూర్వక వాతావరణంలో జరిగిన ఈ భేటీలో వారు చేసిన విజ్ఞప్తులకు సానుకూల పరిష్కారం చూపుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.



అవినీతి,అరాచకమే కాంగ్రెస్ పాలన జోడెడ్లు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 27: మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో గులాబీ జెండా ఎగురుతుందనీ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కౌన్సిలర్లకు సన్మానంతో పాటు ఆలంపూర్ విజేతలకు కేటీఆర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఆలంపూర్, ఐజ, గద్వాల, వడ్డేపల్లి ప్రాంతాల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు అందించిన మద్దతు విశేషమని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ నడిగడ్డలో మాత్రం ప్రజల విశ్వాసం ఇప్పటికీ బీఆర్ఎస్‌పైనే ఉందని పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు మెజారిటీ స్థానాలు గెలుచుకోవడం పార్టీ బలాన్ని నిరూపిస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అరాచక పాలన నడుస్తోందని కేటీఆర్ విమర్శించారు. నాగర్‌కర్నూల్‌లో రెండు నెలల పాప మరణ ఘటన, కోదాడలో దళిత యువకుడు కర్ల రాజేష్ లాకప్ డెత్ వంటి ఘటనలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఖమ్మం వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతలు ప్రజలను రోడ్డున పడేసిన దారుణ చర్యలని ఆక్షేపించారు. కేసీఆర్ నాయకత్వంలో గతంలో అభివృద్ధి, సంక్షేమం రెండు జోడెడ్లలా ముందుకు సాగాయని, కానీ ప్రస్తుతం రాష్ట్రంలో అవినీతి, అరాచకం జోడెడ్లుగా మారాయని ఆయన విమర్శించారు. చెక్ డ్యామ్‌లు పేల్చడం, పల్లె ప్రకృతి వనాల్లో చెట్ల నరుకులు వంటి చర్యలు రాష్ట్రాన్ని వెనక్కి నెడుతున్నాయని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని, రైతు బంధు, ఎరువుల సరఫరా వంటి అంశాల్లో రైతులను తీవ్రంగా నిరాశపరిచిందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజలకు ఇప్పుడు కాంగ్రెస్ నిజ స్వరూపం అర్థమైందన్నారు. నడిగడ్డ స్ఫూర్తి రాష్ట్రం మొత్తం వ్యాపించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ చల్ల వెంకట్రామి రెడ్డి ప్రజల సమస్యలపై అంకితభావంతో పనిచేసే నాయకుడని, ఎమ్మెల్యే విజయుడు కూడా అదే తత్వాన్ని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు చేస్తుందని ముందుగానే హెచ్చరించిన కేటీఆర్, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోసారి కేసీఆర్ నాయకత్వంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఢిల్లీ మద్యం కేసులో కవితకు క్లీన్ చీట్

మొదటిపేజీ తరువాయి

నివాసానికి చేరుకుని ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ కేసులో అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, కవిత కల్వకుంట్ల, కుల్దీప్ సింగ్, నరేందర్ సింగ్, విజయ్ నాయర్, అభిషేక్ బోయినపల్లి, అరుణ్ రామచంద్ర పిళ్ళై, మూత గౌతం, సమీర్ మహేంద్రు, అమన్దీప్ సింగ్ దాల్, అర్జున్ పాండే, గోరంట్ల బుచ్చిబాబు, శరత్ చంద్రా రెడ్డి, రాజేష్ జోషి, దామోదర్ ప్రసాద్ శర్మ, ప్రిన్స్ కుమార్, అరవింద్ కుమార్ సింగ్, చన్‌ప్రీత్ సింగ్ రాయట్, దుర్గేష్ పాఠక్, అమిత్ అరోరా, వినోద్ చౌహాన్, ఆశిష్ చాంద్ మథుర్‌లపై అభియోగాలపై ఆధారాలు లేవని కోర్టు కేసును కొట్టివేసింది.



హైకోర్టును ఆశ్రయించిన సీబీఐ

ఢిల్లీలోని రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టు అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, కవిత సహా మొత్తం 23 మంది నిందితులను ఈ కేసు నుంచి డిశ్చార్జ్ చేస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. ట్రయల్ కోర్టు తీర్పు వెలువడిన కొద్ది గంటల్లోనే సీబీఐ దీనిపై ఢిల్లీ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. దర్యాప్తులోని పలు కీలక అంశాలను రౌస్ అవెన్యూ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని, కొన్ని ముఖ్యమైన సాక్ష్యాలను విస్మరించిందని సీబీఐ తన పిటిషన్‌లో పేర్కొంది. ట్రయల్ కోర్టు ఇచ్చిన డిశ్చార్జ్ ఉత్తర్వులపై స్టే విధించాలని సీబీఐ కోరింది.

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసు ఏంటీ..

అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీ ప్రభుత్వం 2021 నవంబర్ 17న కొత్త మద్యం పాలసీని అమల్లోకి తీసుకువచ్చింది. అయితే, ఈ విధానం ద్వారా అవకతవకలు, స్కామ్ జరిగిందని ఆరోపణలు రావడంతో, 2022 సెప్టెంబరు చివరి నాటికి ఢిల్లీ ప్రభుత్వం ఆ పాలసీని వెనక్కి తీసుకుంది. ఈ మధ్య కాలంలోనే మద్యం లైసెన్సుల కేటాయింపులో, ఎక్సైజ్ పాలసీ సవరణలో భారీ అక్రమాలు జరిగాయని, ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని కేంద్ర దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీ ఆరోపించాయి. ఈ వ్యవహారంలో లైసెన్స్‌దారులకు నిబంధనలకు విరుద్ధంగా ప్రయోజనం చేకూర్చి, అందుకు ప్రతిఫలంగా నిందితులు భారీ మొత్తంలో ముడుపులు అందుకున్నట్లు సీబీఐ, ఈడీలు తమ దర్యాప్తులో పేర్కొన్నాయి. ఈ కుంభకోణం ఆరోపణలపై మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, ఇతర ఆప్ నేతలతో పాటు తెలంగాణకు చెందిన ఎమ్మెల్సీ కవితలను అధికారులు పలు సందర్భాలలో అరెస్టు చేశారు. సుదీర్ఘ విచారణ, జైలు శిక్ష అనంతరం ఈ నేతలు బెయిల్‌పై విడుదలయ్యారు.

పక్కా సాక్ష్యాధారాలతో విచారిస్తున్నాం: ఈడీ

ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన మనిలాండరింగ్ కేసు స్వతంత్రత కలిగిందని ఈడీ అధికారులు తెలిపారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు నేపథ్యంలో ఈడీ ఈ వ్యాఖ్యలు చేసింది. తమ దర్యాప్తు కేవలం సీబీఐ కేసుపై ఆధారపడి లేదని పక్కా సాక్ష్యాధారాలతో విచారిస్తున్నామని ఈడీ అధికారులు తెలిపారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈడీ అధికారుల ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. సీబీఐ సమర్పించిన ఆధారాలకంటే తమ ఆధారాలు చాలా భిన్నమైనవని తెలిపింది. అక్రమంగా సంపాదించిన నిధులను ఎలా సేకరించారో, ఎలా వినియోగించారో వివరంగా ఛార్జిషీట్లలో వెల్లడించామని ఈడీ అధికారులు తెలిపారు. మరోవైపు, ట్రయల్ కోర్టు ఇంకా ఈడీ కేసు మెరిట్‌పై ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని అధికారులు స్పష్టం చేశారు. అవసరమైన సమయంలో తమ వాదనలు కోర్టులో వినిపిస్తామని ఈడీ అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా, మనీ లాండరింగ్ కేసును ప్రిడికేట్ నేరం నుంచి వేరుచేయాలా? లేదా విజయ్ మదన్‌లాల్ కేసులో నిర్వహించిన విధంగా కొనసాగించాలా? అనే అంశంపై కూడా సుప్రీంకోర్టు పరిశీలిస్తోందని తెలిపారు.

కన్నీరుపెట్టుకున్న కేజ్రీవాల్

కోర్టు తీర్పు అనంతరం ఆవరణలో మీడియా ముందు మాట్లాడుతూ కన్నీటిపర్యంతమయ్యారు కేజ్రీవాల్. 'ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఐదుగురు నేతలను జైలులో పెట్టారు. సీఎం, డిప్యూటీ సీఎం సహా ఐదుగురిని జైలులో పెట్టారు. కేజ్రీవాల్ ఏనాడూ అవినీతికి పాల్పడలేదు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడినవాళ్లం మేం. ప్రధాని మోదీ కేవలం విపక్షాలపైనే దృష్టి పెట్టారు. ప్రజల సమస్యలను ప్రధాని మోదీ ఏమాత్రం పట్టించుకోరు. నిరుద్యోగం, దిల్లీలో పొల్యూషన్ గురించి మోదీ మాట్లాడరు. విపక్ష నేతలను రాజకీయంగా వేధించడం గురించి మోదీ ఆలోచిస్తారు. నేను అవినీతిపరుడిని కాదు. కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా నిజాయితీపరులని కోర్టు చెప్పింది. నేడు ఈ కేసులోని నిందితులందరినీ కోర్టు విడుదల చేసింది. నిజం గెలుస్తుందని మేం ఎప్పుడూ చెబుతుంటాం. భారత న్యాయ వ్యవస్థపై మాకు పూర్తి నమ్మకం ఉంది. అమిత్ షా, మోదీ కలిసి ఆప్‌ను అంతం చేయడానికి అతిపెద్ద రాజకీయ కుట్రను పన్నారు. మా పార్టీకి చెందిన ఐదుగురు పెద్ద నాయకులను జైలులో పెట్టారు. కేజ్రీవాల్ అవినీతిపరుడు కాదు. నా జీవితంలో నేను నిజాయితీని మాత్రమే సంపాదించుకున్నాను. నేడు కేజ్రీవాల్, మనీశ్ ఆప్ నిజాయితీపరులని కోర్టు పేర్కొంది.' అని అన్నారు.

గద్వాల్ సీడ్ పత్తి రైతులను ఆదుకోవాలి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, పిబ్రవరి 27: గద్వాల్ సీడ్ పత్తి రైతులకు కరీంనగర్ తరహాలో ఎకరానికి రూ.75 వేల చెల్లింపు చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు.హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిను కలిసి రాష్ట్రంలో విత్తన పంటలు సాగు చేస్తున్న రైతుల సమస్యలను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వివరించారు. కాంట్రాక్ట్ ఫార్మింగ్ చట్టం సక్రమంగా అమలు కావడం లేదని, గద్వాల్ జిల్లాలో 10 వేల మంది సీడ్ పత్తి రైతులకు రూ.200 కోట్ల బకాయిలు ఉన్నాయని, కంపెనీలుఆర్గనైజర్లు రైతులను బహుళ స్థాయిలో మోసం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. రైతులకు అనుకూలంగా చట్టంలో లోపాలు సవరించి, విత్తన రైతులకు రక్షణ కల్పించాలని కమిషన్‌ను కోరారు.



'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా తెలంగాణ లక్ష్యం

రాష్ట్రంలో రైతులు సుమారు 60 రకాల విత్తన పంటలు పండిస్తూ తెలంగాణను 'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని కవిత పేర్కొన్నారు. అయితే 2007లో వచ్చిన కాంట్రాక్ట్ ఫార్మింగ్ చట్టం ప్రకారం రైతులకు ఉండాల్సిన హక్కులు అమలులో లేవని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రైతుకు మేలు చేసే విధంగా ఆ చట్టాన్ని ఉపయోగించడం లేదన్నారు. గద్వాల్ జిల్లాలో సీడ్ పత్తి రైతులకు అడ్వాన్స్‌లు ఇస్తూ వాటిపై వడ్డీ వసూలు చేయడం, భూములను తనఖా పెట్టించుకోవడం జరుగుతోందని కవిత ఆరోపించారు. అడ్వాన్స్, పురుగుమందుల ఖర్చుల పేరుతో కూడా భూములు రాయించుకుంటున్నారని తెలిపారు. పైగా 250 గ్రాముల తరుగు కూడా తీసుకుంటున్నారని అన్నారు. కరీంనగర్‌లో వరి విత్తన రైతులకు ఎకరానికి రూ.75 వేలు చెల్లిస్తున్నప్పటికీ, గద్వాల్‌లో అదే స్థాయి చెల్లింపులు లేవని ఆమె విమర్శించారు. వరి విత్తన రైతులకు ప్రొక్యూర్ చేసిన తర్వాత మిగిలిన ధాన్యాన్ని కమర్షియల్‌గా అమ్ముకునే స్వేచ్ఛ ఉంటే, గద్వాల్ సీడ్ పత్తి రైతులకు ఆ అవకాశమూ లేదన్నారు.

కంపెనీలు బాధ్యత వహించాలి

సీడ్ ఇచ్చిన తర్వాత అది ఫెయిల్ అయితే రైతుకు సంబంధం ఉండకూడదని, కంపెనీ ఇచ్చిన విత్తనం ఫెయిల్ అయితే కంపెనీయే బాధ్యత వహించాలన్నారు. కానీ సరిగా నాటలేదంటూ రైతులపై నెపం మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గద్వాల్ జిల్లాలో 10 వేల మంది సీడ్ పత్తి రైతులకు రూ.200 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని తెలిపారు. ఈ అంశంపై రైతు కమిషన్ జోక్యం చేసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు.

చట్ట సవరణలు అవసరం

చట్టంలో ఉన్న లోటుపాట్లను సరిచేయాలని, మంచి సీడ్ చట్టం తీసుకురావాలని కవిత డిమాండ్ చేశారు. మోస్ట్ పాయిజన్ పెస్టిసైడ్స్ రాష్ట్రంలో బ్యాన్ కాలేదని, కనీసం వాటి విక్రయాన్ని పరిమితం చేసే చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయాధికారులు రైతుల పక్షాన నిలవడం లేదని ఆమె విమర్శించారు. సీడ్ పత్తి ఆర్గనైజర్లు, మీడియేటర్లు రైతులను పట్టిపీడిస్తున్నారని ఆరోపించారు. పంట వచ్చినా రాకపోయినా రైతులకు ఒప్పందం ప్రకారం డబ్బులు చెల్లించాలని చట్టంలో ఉన్నప్పటికీ అమలు చేయడం లేదన్నారు. పంట విఫలమైతే రైతులు పడే మానసిక ఆందోళనను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడిన రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కవిత ప్రజా సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకురావడం అభినందనీయం అన్నారు. గద్వాల్ సమస్య సీరియస్ విషయమని, సీఎం దృష్టికి తీసుకెళతామని తెలిపారు. విత్తన కంపెనీలు ఆర్గనైజర్ల ద్వారా వ్యవహరిస్తున్నాయని, కల్తీ విత్తనాల సమస్య పెరిగిందని పేర్కొన్నారు. రాష్ట్ర పరిధిలో విత్తన చట్టం తీసుకురానున్నామని, దాని ప్రతిని కవితకు అందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్, కన్వీనర్ బుచ్చిబాబు, జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.రూప్ సింగ్, ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, ఇస్మాయిల్ సయ్యద్, జాగృతి రాష్ట్ర కార్యదర్శి భవానీ వేముల, రైతు జాగృతి అధ్యక్షుడు నవీన్, రెడ్డి, శ్రావణి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


మొయినాబాద్ మున్సిపాలిటీ ని నెంబర్ 1గా తీర్చిదిద్దాలి

- అబివృద్ధికి మేము సైతం సహకరిస్తాం.
- మున్సిపల్ కు అధిక నిధులు తీసుకువస్తాం.
- ఇప్పటికే మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరు.
- ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి.

ప్రతిపక్షం,మొయినాబాద్, ఫిబ్రవరి 277: మొయినాబాద్ మున్సిపాలిటీని నెంబర్ 1 గా తీర్చిదిద్దే బాధ్యత చైర్ పర్సన్, వైస్ చైర్మన్ దేనని ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు.మొయినాబాద్ లోని అంజనాదేవి గార్డెన్ లో ఎమ్మెల్యే కాలె యాదయ్య అధ్యక్షతన శుక్రవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పాలకవర్గం సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విఫ్ డా. పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహ్మా రెడ్డితో పాల్గొన్నారు. చైర్ పర్సన్ సానియా దర్శన్, వైస్ చైర్మన్ గరుగు రాజు, కౌన్సిలర్లను శాలువాలు, పుష్పగుచ్చాలతో సన్మానించారు. ఈ సందర్భంగా చీఫ్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... మున్సిపల్ అభివృద్ధిలో తమ సహకారం ఉంటుందన్నారు. మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్ద ఎత్తున్న నిధులు మంజూరు చేయిస్తామన్నారు. మున్సిపాలిటీ ఏర్పాటు కావడం వల్ల నిధులు ఎక్కువగా వచ్చి అభివృద్ధి చెందుతుందన్నారు.



సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందరికీ అందించాలన్నారు. మీపై నమ్మకంతో ఓట్లు వేశారని, అభివృద్ధి కోసం ఆశతో చూస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి చేయాలని సూచించారు. హైదరాబాద్ తరహాలో మూడు మున్సిపాలిటీలు అభివృద్ధిచెందుతున్నాయన్నారు. రోడ్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారం పురోగతి సాధిస్తుందన్నారు.బాధ్యతతో పాటు మీపై బరువు ఉందని అందరిని కలుపుకుని పనిచేయాలన్నారు. మంచి పనులు చిరకాలం గుర్తిండి పోతాయన్నారు. మాట తీరు మంచిగా ఉండాలని సూచించారు.మొయినాబాద్ మున్సిపాలిటీని నెంబర్ 1గా తీర్చిదిద్దాలన్నారు. ఇప్పటికే మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరైయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బొంతు రామ్మోహన్ రావు, భీంభరత్, గౌరి సతీష్, చంద్రరెడ్డి, షాబాద్ దర్శన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లగోల్ల మల్లేష్ యాదవ్, మొయినాబాద్ కౌన్సిలర్లు పల్లగోల్ల విజయలక్ష్మి అశోక్ యాదవ్, షాబాద్ కిషన్, బిల్లపాటి కవిత ఎల్లేష్, బేగంబీ, గడ్డం లక్ష్మి వెంకట్ రెడ్డి, సదువు శ్రీలత రాంచందర్ ముదిరాజ్, గౌర అనసూయ నరసింహ, జగపతి బాబు, గునుగుర్తి సరిత కిరణ్, సన్వేల్లి అమరేందర్ రెడ్డి, చాకలి యాదగిరి, చెగురి అరుణ రామకృష్ణ గౌడ్, పాటీ పావని జగన్మోహన్ రెడ్డి, గీత వనజాక్షి, కర్రోల శ్రీధర్, ముదిగొండ ప్రభాకర్ యాదవ్, మద్యపాగ మహేష్, పడమటి మమతా మోహన్ రెడ్డి, ఆయా పార్టీల నాయకులు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రాంతీయ భాషలను అంతం చేసి హిందీ ఆధిపత్యాన్ని రుద్దాలని భారతీయ జనతా పార్టీ చూస్తోంది. దేశంలోని ప్రతి ప్రాంతాన్ని గర్వంగా చాటిచెప్పే 'జనగణమన'ను కూడా బీజేపీ ఎక్కడ తొలగిస్తుందోనని భయమేస్తోంది. ఈ పరిస్థితులలో ప్రాంతీయ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. మద్యం కుంభకోణం కేసులో కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిన కేజ్రీవాల్, మనీష్ సిసోడియాలకు అభినందనలు.

- శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే


ప్రయోజనాల కోసం రాహుల్ విలువైన సూచనలు

- **కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**



ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: దేశ ప్రజల సంక్షేమం దృష్ట్యా బాధ్యత గల ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీ ఎప్పటికప్పుడు పార్లమెంట్ వేదికగా విలువైన సూచనలు చేస్తున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పేర్కొన్నారు. డిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో కరోనా మహమ్మారి వ్యాప్తి చెందకముందే కేంద్ర ప్రభుత్వాన్ని రాహుల్ గాంధీ అప్రమత్తం చేశారని జగ్గారెడ్డి తెలిపారు. విదేశాల నుంచి భారత్‌కు వచ్చే ప్రయాణికులపై కట్టుదిట్టమైన నియంత్రణలు విధించాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అప్పట్లోనే సూచించారని గుర్తు చేశారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ ఆ సూచనలు విన్నప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు. అనంతరం దేశం రెండేళ్ల పాటు కరోనా కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాన్ని దేశ ప్రజలు మరిచిపోలేరన్నారు. అదేవిధంగా డిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యంపై కూడా రాహుల్ గాంధీ పార్లమెంట్ లో పలుమార్లు ప్రస్తావిస్తూ, కాలుష్య నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరుతున్నారని చెప్పారు. కాలుష్య నివారణకు ఆయన ఇస్తున్న సూచనలను కూడా ప్రధాని మోడీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకుడిగా దేశ ప్రజల ప్రయోజనాల కోసం రాహుల్ గాంధీ నిరంతరం తన అభిప్రాయాలు, సూచనలు తెలియజేస్తున్నప్పటికీ, వాటిని అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమవుతోందని జగ్గారెడ్డి విమర్శించారు.దేశ హితాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతిపక్ష సూచనలను స్వీకరించి అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

విద్యా కమిషన్‌లో నిపుణులు ఎక్కడ?



- **సీఎం రేవంత్ సమాధానం చెప్పాలి**
- **మాజీ మంత్రి, అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు**

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 27: కమిషన్‌లో అసలైన విద్యావేత్తలు లేకుండానే కొత్త విద్యా విధానం రూపొందించడం ఎలా సాధ్యమని ప్రశ్నిస్తూ, ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని మాజీ మంత్రి , అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు డిమాండ్ చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి హరీష్‌రావు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ విద్యా కమిషన్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. కమిషన్‌లో అసలైన విద్యావేత్తలు లేకపోవడాన్ని ప్రశ్నిస్తూ, ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన, స్కూల్ లేదా యూనివర్సిటీ స్థాయిలో బోధనా అనుభవం ఉన్న నిపుణులు కమిషన్‌లో లేరని ఆరోపించారు. ఎడ్యుకేషన్‌లో పీహెచ్‌డీ చేసినవారు, సిలబస్ రూపకల్పనలో అనుభవం ఉన్న సబ్జెక్ట్ నిపుణులు కమిటీలో ఒక్కరైనా ఉన్నారా అని ప్రశ్నించారు. పరిపాలన అనుభవం ఉన్న అధికారులతో విద్యా విధానం తయారు చేయడం సరైన పద్ధతి కాదని వ్యాఖ్యానించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే కీలక నిర్ణయాలు తీసుకునే కమిషన్‌లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, చైల్డ్ సైకాలజిస్టులు, విద్యా నిపుణులు ఉండాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. విద్యాశాఖను నిర్లక్ష్యం చేస్తూ, అర్హతలేని వారితో ప్రయోగాలు చేయడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటమేనని విమర్శించారు. కొత్త విద్యా విధానం రూపకల్పనలో పారదర్శకత అవసరమని, వెంటనే అర్హులైన విద్యావేత్తలకు బాధ్యతలు అప్పగించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

ప్రముఖ అర్చకులు సౌందర రాజన్ కన్నుమూత

- **రెండు రోజుల పాటు చిలుకూరి బాలాజీ ఆలయం మూసివేత**



ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 27: ప్రముఖ పుణ్యక్షేత్రం చిలుకూరు బాలాజీ ఆలయానికి ఆధ్యాత్మిక గుర్తింపు తీసుకొచ్చిన ప్రముఖ అర్చకులు, పండితులు డా. ఎమ్వీ. సౌందర రాజన్ శుక్రవారం కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చిలుకూరులోని నివాసంలో తుదిశ్వాస విడిచారు.ఆయన మృతితో ఆధ్యాత్మిక వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

సౌందర రాజన్ మృతిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన ఓ గొప్ప విద్యావేత్తగా, ఆధ్యాత్మిక నాయకుడిగా సమాజానికి సేవలు అందించారని కొనియాడారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా, రిజిస్ట్రార్‌గా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని సీఎం పేర్కొన్నారు. చిలుకూరు బాలాజీ ఆలయానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో ఆయన పాత్ర ఎంతో గొప్పదని తెలిపారు. సౌందర రాజన్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని ముఖ్యమంత్రి ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రెండు రోజుల పాటు ఆలయం మూసివేత

సౌందర రాజన్ మృతి నేపథ్యంలో చిలుకూరు బాలాజీ ఆలయాన్ని ఫిబ్రవరి 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు మూసివేయాలని ఆలయ నిర్వాహకులు నిర్ణయించారు. ఈ రెండు రోజుల పాటు భక్తులకు దర్శనం ఉండదని తెలిపారు. అనంతరం ఆలయాన్ని తిరిగి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. ఆలయాన్ని రెండు రోజుల పాటు మూసివేయడం ద్వారా ఆయనకు గౌరవ నివాళి అర్పిస్తున్నామని ఆలయ నిర్వాహకులు వివరించారు.



ప్రభుత్వం ఏం చేసింది.. ఏం చేయాలి

- **సమగ్ర నివేదిక రూపొందించండి**
- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్**
- **99 రోజుల యాక్షన్ ప్లాన్ సబ్ కమిటీ సమావేశం**

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 27: రెండు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం ఏం చేసింది, రాబోయే రోజుల్లో ఏం చేయాలనుకుంటుంది ప్రజలకు స్పష్టంగా అర్థం అయ్యేలా వివరించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రజాభవన్ లో 99 డేస్ యాక్షన్ ప్లాన్ సబ్ కమిటీ సమావేశం కమిటీ చైర్మన్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. వివిధ స్థాయిల్లో ఏ తరహా కార్యక్రమాలు చేపట్టాలి, వివిధ శాఖలను ఏ విధంగా సమన్వయం చేసుకోవాలి, పూర్తి సమాచారంతో కూడిన నివేదికల రూపొందించడం అనే అంశాలను నివేదికలో జోడించాలని మంత్రులు సూచించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, యోగితా రానా, క్రిస్టిన, అనిత రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్

- **రూ.745 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదల**

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 27: ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వంగుడ్ న్యూస్ చెప్పింది. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ఆర్థిక బకాయిల విషయంలో డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం నాడు ఆయన ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ అధికారులు రూ.745 కోట్ల పెండింగ్ బిల్లులను విడుదల చేశారు. గతంలో ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపిన తర్వాత పెండింగ్ బిల్లులను విడతల వారీగా క్లియర్ చేస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకుంది. ప్రభుత్వం విడుదల చేసిన రూ.745 కోట్లతో ఉద్యోగులకు పెద్ద ఊరట లభించినట్లయింది. కేవలం ఉద్యోగులకే కాకుండా, పంచాయితీల్లో అభివృద్ధి పనులు, పెండింగ్ బిల్లుల కోసం ప్రభుత్వం అదనంగా రూ389 కోట్లను ఆర్థిక శాఖ విడుదల చేసింది. ఈ నిధుల విడుదల ద్వారా గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు వేగవంతం కానున్నాయి.

ఉద్యోగుల కోసం ప్రభుత్వం నిలబడుతుంది

- **ఉద్యోగులు ప్రజల కోసం నిలబడాలి**
- **ఉద్యోగ సంఘ నాయకులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 27: ఉద్యోగుల కోసం ప్రభుత్వం నిలబడుతుందని, ఉద్యోగులు ప్రజల కోసం నిలబడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీం, కోటి రూపాయల ప్రమాద బీమా, సహజ మరణానికి 10 లక్షల బీమా, విద్యా విధాన పరిషత్తు ఉద్యోగులను 010 పద్దు కింద తీసుకురావడంలో దిశా నిర్దేశం చేసిన సందర్భంగా శుక్రవారం సాయంత్రం ప్రజా భవన్లో ఉద్యోగ సంఘ నాయకులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ను సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఉద్యోగులను బాగా చూసుకోవాలనేది ప్రభుత్వం లక్ష్యం అన్నారు. ప్రజా ప్రభుత్వం పాలనలో చేపట్టే ప్రతి అంశం చివరి వ్యక్తి వరకు చేరే కార్యక్రమాన్ని ఉద్యోగులతో చేయించాలనేది ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఉద్యోగ వ్యవస్థ బలంగా ఉండాలని, వారి కుటుంబాలు భరోసాతో ఉండాలని కోటి రూపాయల ప్రమాద బీమా, హెల్త్ స్కీం తీసుకొచ్చామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ప్రజలకు వ్యవస్థలు, సంస్థలు ఉపయోగపడాలనేది తమ కోరిక అన్నారు. రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలు ఉండగా 1.02 కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, అదే విధంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ అమలు చేస్తున్నామని అన్నారు. ప్రతి పథకం ప్రజల దగ్గరికి తీసుకు వెళ్లేందుకు 99 రోజుల కార్యక్రమాన్ని తీసుకువచ్చామని వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సీరియస్ గా తీసుకొని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు, దామోదర్ రెడ్డి, సదానంద్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, బి.శ్యామ్, దాస్య నాయక్, వెంకట్ రెడ్డి, ఉమా దేవి, డాక్టర్ రామారావు, షౌకత్ హుస్సేన్, వెంకట్, సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన భట్టి


- **కుమారుడి వివాహానికి రావాలని పిలుపు**
- **ఏపీ కాంగ్రెస్ నాయకులనూ ఆహ్వానించిన డిప్యూటీ సీఎం**



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 27: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిశారు. తన పెద్ద కుమారుడు మల్లు సూర్య విక్రమాదిత్య వివాహం మార్చి 5న హైదరాబాద్ లో జరగనున్న నేపథ్యంలో శుక్రవారం అమరావతికి చేరుకున్న ఆయన., ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకి తన కుమారుడి వివాహ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. భట్టితో పాటు మంత్రి శ్రీధర్ బాబు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు ఇద్దరినీ శాలువాలతో సత్కరించి వెంకటేశ్వరస్వామి చిత్రపటాలను వారికి అందజేశారు. మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్‌తో పాటు పలువురు అందుబాటులో ఉన్న మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఐఏఎస్ లు, ఉన్నతాధికారులకు కూడా కుమారుడి వివాహ ఆహ్వాన పత్రాలను భట్టి అందజేశారు. అనంతరం విజయవాడలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఆంధ్రరత్న భవన్ కు చేరుకున్న భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. పీసీసీ మాజీ అధ్యక్షులు, సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజుతో పాటు పలువురు నాయకులకు కూడా భట్టి శుభలేఖను అందించారు. ముందుగా బెజవాడ కనదుర్గమ్మ ఆలయానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భట్టికి వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు.

కొత్తగూడెం కార్పొరేషన్‌కు 'పాల్వంచ' పేరు చేర్చాలి

- **ముఖ్యమంత్రి రేవంత్ కి ఎమ్మెల్యే కూనంనేని లేఖ**
- **అసెంబ్లీలో తీర్మానం చేసి పేరు మార్చాలని సీఎంకు విన్నపం**



ప్రతిపక్షం ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 27 : కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పేరును 'కొత్తగూడెం పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్'గా మార్చాలని కోరుతూ కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఇటీవల కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలతో పాటు సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీలను విలీనం చేసి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ నూతన కార్పొరేషన్‌కు కేవలం కొత్తగూడెం పేరు మాత్రమే ఉందని, పాల్వంచ పేరు చేర్చాలని అక్కడి ప్రజలు కోరుకుంటున్నారని, వారి మనోభావాలను గౌరవిస్తూ పేరు మార్చాలని ఎమ్మెల్యే కోరారు. పాల్వంచకు ఘనమైన చరిత్ర ఉందని, గతంలో ఇది ఒక సంస్థానంగా, ప్రత్యేక అసెంబ్లీ నియోజకవర్గంగా విరాజిల్లిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అటువంటి చారిత్రక ప్రాధాన్యత కలిగిన పాల్వంచ పేరును కార్పొరేషన్‌లో చేర్చడం ద్వారా ఆ ప్రాంత గౌరవాన్ని, ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడినట్లవుతుందని కూనంనేని పేర్కొన్నారు. కార్పొరేషన్ పేరు మార్పు విషయంలో పాల్వంచ ప్రజల కోరిక అత్యంత సమంజసమని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణమే అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. త్వరితగతిన 'కొత్తగూడెంపాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్'గా అధికారిక ప్రకటన వెలువడేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరుతూ పంపిన లేఖలో ఆయన వివరించారు.

జీఐ అనేది మన చరిత్ర, గుర్తింపు

మొదటిపేజీ తరువాయి

ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. బస్సులపై వినూత్నంగా తెలంగాణ రాష్ట్రంలో జీఐ (జియోగ్రాఫికల్ ఇండికేషన్) ట్యాగ్ ఉన్న ఆరు రకాల కళాకృతులను ముద్రించారు. హైదరాబాద్ ఎంజీబీఎస్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిలు ఈ బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. జీఐ ఆన్ వీల్స్ కార్యక్రమం ఆలోచన గురించి తొలిసారిగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు చెప్పిన వెంటనే స్పందించారని గవర్నర్ తెలిపారు. ఒక్కో బస్సుపై ఒక్కో ప్రత్యేక జీఐ వర్క్‌తో విస్తృత ప్రచారం నిర్వహించడం అభినందనీయమన్నారు. జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ అనేది మన చరిత్ర, గుర్తింపు, సంప్రదాయమని, జీఐ ట్యాగ్స్ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని గవర్నర్ జిష్ణు దేవ్ అన్నారు. బస్సులపై జీఐ ఆర్ట్ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయ కళలు చేతిపనులపై అవగాహనను తెస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పర్యాటక అభివృద్ధి చేతివృత్తులవారిని ప్రోత్సహిస్తుందని చెప్పారు. జీఐ ఆర్ట్ వర్క్ ఉన్న 6 ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రారంభించామని పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. సంస్కృతిని, కళాకారులను, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. పోచంపల్లి ఇక్కత్, నారాయణపేట చీరలు, నిర్మల్ పెయింటింగ్, చేర్యాల స్క్రోల్ పెయింటింగ్, వరంగల్ తివాచీలు, కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీలను బస్సులపై ముద్రించారు. జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులతో వీటిని డిజైన్ చేయించగా.. తొలిదశలో ఆర్టీసీ ఈ ప్రత్యేక స్టిక్కర్లను ఒక్కో జిల్లాకు చెందిన ఆరు ఎక్స్‌ప్రెస్ బస్సులపై ముద్రిస్తారు. ఈ ఆరు జిల్లాలలో ఆయా ప్రాంత ప్రత్యేకతను చాటే విధంగా.. ఆ ఆరు జిల్లాలకు తిరిగే బస్సులపై జీఐ ట్యాగ్ పొందిన గుర్తింపులను ముద్రించి తిప్పుతారు. ఈ బస్సుల్ని హైదరాబాద్ వయా పోచంపల్లి, హనుమకొండ, నారాయణపేట, కరీంనగర్, నిర్మల్‌కు నడుపుతరు. తెలంగాణ సంస్కృతిని చాటడంతో పాటుగా పర్యాటకుల్ని ఆకర్షించేలా ఈ నిర్ణయం తీసుకున్నారు. కళాకారులకు ప్రోత్సాహం, పర్యాటకానికి ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు.

జీహెచ్‌ఎంసీ చట్టం స్థానంలో కోర్ అర్బన్ చట్టం

మొదటిపేజీ తరువాయి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో,హైదరాబాద్, ఫిబ్రవరి 27 : అవుటర్ రింగురోడ్డు పరిధిలోని (కోర్ అర్బన్) మూడు కార్పొరేషన్లకు వర్తించేలా గ్రేటర్ హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ) చట్టం స్థానంలో కోర్ అర్బన్ చట్టం తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అనుమతులు, రుసుములు, అభివృద్ధి పనుల నిర్వహణ, ఇతర వ్యవహారాలన్నింటికి ఆ చట్టమే ఆధారంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 99 రోజుల కార్యక్రమంలో మున్సిపల్ పరిధిలో చేపట్టే పనులు తొలుత చేపడతామని సీఎం తెలిపారు. ఎంఏయూడీపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కోర్ అర్బన్ ఏరియాలో పారిశుద్ధ్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. పలు ప్రాంతాల్లో చెత్త ఎక్కడి వేయాలో తెలియక ప్రజలు ఖాళీ ప్రదేశాల్లో వేస్తున్నారని.. ముందుగా చెత్త వేయాల్సిన ప్రాంతాలను గుర్తించి అక్కడ బోర్డులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆ తర్వాత నిర్దేశిత ప్రాంతాల్లో కాకుండా ఇష్టారీతిగా ఎక్కడిపడితే అక్కడ చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం పేర్కొన్నారు. కోర్ అర్బన్ ఏరియాలో రోడ్ల నిర్మాణ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉపాధిహామీలో రోడ్ల నిర్మాణం, నిర్దేశిత కాలం వరకు మళ్లీ వేయడానికి అనుమతులు రావని సీఎం అన్నారు. రోడ్డు నిర్మించిన తర్వాత దాని జీవిత కాలం ఎంతనేది నిర్ణయించి, ఆ లోపు దానిని తొలగించినా అక్కడ మళ్లీ రోడ్డు వేసినా అందుకు బాధ్యులు ఎవరో తేల్చాలని సీఎం ఆదేశించారు. కోర్ అర్బన్ ఏరియాలో ప్రతి వీధి దీపం వెలుగుతుందో లేదో డ్యాష్ బోర్డులో కనిపించాలని సీఎం అన్నారు.

ఫైర్ సేఫ్టీకి పెద్ద పీట వేయాలి

కోర్ అర్బన్ ఏరియాలో ఫైర్ సేఫ్టీకి పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 50 అంతస్తులకుపైగా భవంతులు నిర్మాణాలు జరుగుతున్నాయని, అంత ఎత్తులో అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు అవసరమైన అధునాతన సామగ్రి, సాంకేతికతను సమకూర్చుకోవాలని సీఎం సూచించారు. నగరంలోని సర్కిల్స్ లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టాలని సీఎం సూచించారు. అదే సమయంలో యూనిపోల్స్‌ను ఏర్పాటు చేసి వాటిని మల్టీ యుటిలిటీ పోల్స్‌గా ఉపయోగించాలని సీఎం తెలిపారు. కోర్ అర్బన్ ఏరియా పరిధిలో ఆర్ అండ్ బీ, ఇతర విభాగాల పరిధిలోని రోడ్లన్నింటిని ఎంఏయూడీ పరిధిలోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు.

ఫ్యూచర్ సిటీలో పనులు వేగవంతం చేయాలి

భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో వివిధ ప్రభుత్వ కార్యాలయాల భవనాల పనులు వేగవంతం చేయాలని సీఎం సూచించారు. నిర్మాణాల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నగరంలోని పెద్ద చెరువులు, కుంటల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. హైడ్రా పరిరక్షించిన చెరువుల చుట్టూ కట్టలు కట్టి వదిలి వేయకుండా వాటి రక్షణతో పాటు సుందరీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. పర్యాటక ప్రదేశాలుగా జల వనరులను మార్చాలని సీఎం సూచించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, ఎంఏయూడీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఎంఆర్‌డీసీఎల్ ఎండీ నరసింహారెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనర్లు కర్ణన్, జి.సృజన, వినయ్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



కూటమి పాలనలో ఉత్తరాంధ్ర శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. నేడు అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని ఇండస్ట్రియల్ పార్కులో ప్రముఖ ఫార్మా సంస్థ 'బ్లూ జెట్ హెల్త్ కేర్ లిమిటెడ్'కు శంకుస్థాపన చేయనున్నాం. రూ.2,300 కోట్ల పెట్టుబడితో 1,750 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు రానున్నాయి. 2028-29 ఆర్థిక సంవత్సరానికి సంస్థ తన కార్యకలాపాలను ప్రారంభించనుంది.

- ఏపీ మంత్రి నారా లోకేశ్

ఓపెన్ వాయిస్


అమెరికాను మించి ఇజ్రాయెల్!

భారత ప్రధాని నరేంద్రమోదీ రెండు రోజుల పర్యటన కోసం ఇజ్రాయెల్ వెళ్లారు. ఈ పర్యటన భారత్‌కు అతి కీలకమైనదిగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. భారత్ -ఇజ్రాయెల్ సంబంధాలు కేవలం ఆధునిక ఒప్పందాలకు మాత్రమే పరిమితం కాదు.. దశాబ్దాలుగా రహస్య సహకారంతో ముడిపడి ఉన్నాయి. ఈ దౌత్య బంధం రక్షణ, సాంకేతికతల్లో కీలక పాత్ర పోషిస్తోంది.దౌత్య సంబంధాలు లేనప్పటికీ ఇజ్రాయెల్ 1971లో భారత్‌కు ఆయుధాలు, శిక్షణ అందించి అమెరికా ఒత్తిళ్లను ఎదిరించింది. ఈ రహస్య చర్య భారత విజయానికి ముఖ్య కారణమైంది. ఇది రెండు దేశాల మధ్య విశ్వాసానికి మొదటి గుర్తింపు.ఇక 1980లో పాకిస్తాన్ అణు కార్యక్రమాన్ని ఆపేందుకు ఇజ్రాయెల్ ధ్వంసా అధికారం సిఫార్సు చేసింది. ఈ ప్రతిపాదన భారత భద్రతా ఆందోళనలను పరిష్కరించే స్ఫూర్తిని చూపింది. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య జరిగిన చర్చలు రెండు దేశాలను వ్యూహాత్మకంగా దగ్గర చేశాయి. ఇరు దేశాల బంధాన్ని బలోపేతం చేశాయి.ఇక ఇటీవల ఆపరేషన్ సిందూర్‌కు ఇజ్రాయెల్ పూర్తి మద్దతు ఇచ్చింది. పాకిస్తాన్‌కు టర్కీ డ్రోన్లు అందించింది. వాటితో భారత్‌పై పాకిస్తాన దాడికి యత్నించింది. అదే సమయంలో ఇజ్రాయెల్ భారత్ యాంటీ డ్రోన్ టెక్నాలజీ అందించింది. దీంతో భారత సైన్య పాకిస్తాన్ డ్రోన్లను సమర్థవంతంగా తిప్పికొట్టింది. నెతన్యాహు గతంలో ఐక్యరాజ్యసమితిలో వాషింగ్టన్ కంటే ఢిల్లీనే ఎక్కువగా నమ్ముతామని చెప్పారు. ఇక ఎయిర్‌పోర్టులో నెతన్యాహు భార్య కాషాయ రంగు దుస్తులు ధరించి వచ్చింది. ఇలాంటి నేపథ్యంలో మోదీ పర్యటనపై ఒకవైపు సానుకూల విశ్లేషణలు వస్తుండగా కొందరు ఈ పర్యటనతో భారత్‌కన్నా ఎక్కువగా నెతన్యాహుకే లబ్ధి కలుగుతుందని అభిప్రాయపడుతున్నారు. మోదీ పర్యటన వెనుక రాజకీయ లక్ష్యాలు ఉన్నట్లు పేర్కొంటున్నారు.గతంలో భారత్ - ఇజ్రాయెల్ మధ్య సత్సంబంధాలు ఉండేవి కావు. పాలస్తీనాపై వ్యతిరేకత కారణంగా భారత్ ఇజ్రాయెల్‌ను దూరంగా ఉంచింది. అయితే పీవీ నర్సింహారావు పాలనలో దౌత్య సంబంధాలు ఏర్పడ్డాయి. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రక్షణ, సాంకేతికతల్లో భారత్ -ఇజ్రాయెల్ బంధం బలపడింది. తాజా పర్యటనలో ఇజ్రాయెల్ పార్లమెంట్ (క్నెసెట్)లో ప్రసంగం చారిత్రకం. అయితే, విపక్షం ప్రభుత్వ వ్యతిరేకతతో బహిష్కరణ ప్రకటించింది.నెతన్యాహు బలహీన స్థితిలో ఉన్నారు. ఎన్నికలు జరిగితే ఓటమి అవకాశం ఎక్కువ. అవినీతి ఆరోపణలు, జుడీషియల్ సంస్కరణలపై ప్రతిపక్షుల వ్యతిరేకత, హమాస్ దాడి ముందు పదవి కోల్పోయే పరిస్థితి. ప్రపంచవ్యాప్తంగా వందకు పైగా దేశాలు వ్యతిరేకులు, సౌత్ ఆఫ్రికా అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నుంచి అరెస్ట్ వారెంట్ కోరిందినెతన్యాహు మోదీ ఆహ్వానంతో తన ఇమేజ్‌ను మెరుగుపరచుకోవాలని భావించారు. భారత్ ప్రధాని సందర్శన ఆయనకు దేశీయ, అంతర్జాతీయ గౌరవాన్ని పెంచుతుంది. ఈ ప్రాంతంలో చర్చలు - శాంతియుత పరిష్కారాలకు భారతదేశం నిరంతర మద్దతు తెలుపుతుందని, ఉద్రిక్తతలను తగ్గించడానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రధాన మంత్రి మోదీ వెల్లడించారు. శాంతికి మార్గంగా గాజా శాంతి ప్రణాళికను ఆయన ప్రత్యేకంగా స్వాగతించారు. స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి భారత్ పూర్తిగా మద్దతు ఇస్తుందని, మానవాళి ఎప్పుడూ సంఘర్షణ బాధితురాలిగా మారకూడదని పేర్కొన్నారు. ఉమ్మడి మీడియా సమావేశంలో, ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు ప్రధాన మంత్రి మోదీ పర్యటనను అద్భుతమైనదిగా, అసాధారణంగా అభివర్ణించారు. తక్కువ వ్యవధి ఉన్నప్పటికీ, ఇది చాలా హృదయాన్ని కదిలించేదన్నారు.అంతకుముందు రోజు పార్లమెంటులో ప్రధాని మోదీ ప్రసంగం భావోద్వేగ ప్రభావాన్ని ఆయన ప్రశంసించారు. అది ఇజ్రాయెల్‌లోని ప్రతి ఒక్కరి కళ్ళలో కన్నీళ్లు తెప్పించలేదని అన్నారు. కృతజ్ఞతను వ్యక్తం చేస్తూ, నెతన్యాహు ఇజ్రాయెల్ భారతదేశం అచంచలమైన స్నేహానికి ఎంతో రుణపడి ఉందని అన్నారు. రెండు దేశాల మధ్య వ్యక్తిగత సంబంధాలను ప్రతిబింబిస్తూ, వారి వివాహానికి ముందు టెల్ అవీవ్‌లోని ఒక భారతీయ రెస్టారెంట్‌లో తన భార్య సారాతో అద్భుతమైన భోజనాన్ని ఆస్వాదించడం గురించి వ్యక్తిగత కథను పంచుకున్నారు. రెండు దేశాల మధ్య ప్రతిభావంతులు, ఆలోచనలు, భావాలు సమావేశమయ్యే అవకాశాలను ఇజ్రాయెల్ నాయకుడు నెతన్యాహు ప్రస్తావించారు. ఈ సంబంధం కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రతిపక్షం
హైదరాబాద్
శనివారం
28.02.2026

మధ్య ప్రాచ్యంలో మోగుతున్న సమర శంఖారావం

ఇరాన్-అమెరికా ల మధ్య యుద్ధం గనుక సంభవిస్తే చైనా కూడా పూర్తిగా రష్యా చమురు దిగుమతులపై ఆధార పడక తప్పదు. ఏది ఏమైనప్పటికీ వర్తమాన ప్రపంచంలో జరుగుతున్న అమెరికా ప్రేరిత యుద్ధాలు ఇతర దేశాల సంపదను కొల్లగొట్టడానికే. అమెరికా చర్యలు మూడవ ప్రపంచ యుద్ధానికి దారి తీసే అవకాశాలను కొట్టి పారేయలేం.



సుంకవల్లి సత్తిరాజు
9704903463

ఆఫ్రో యూరేషియా భౌగోళిక రాజకీయ ఖండాంతర ప్రాంతమైన "మధ్య ప్రాచ్యం" (మిడిల్ ఈస్ట్)లో యుద్ధ శంఖారావం మారుమ్రోగుతున్నది. అగ్రదేశమైన అమెరికా మారణ హోమానికి శ్రీకారం చుదుతుంటే, ఇరాన్ కూడా ఇందుకు సై అంటూ కదన రంగంలోకి అడుగు పెట్టడానికి తన శక్తి యుక్తులను వినియోగిస్తున్నది. రావణ కాష్టానికి రంగం సిద్ధమైనది. ఇరాన్,ఇరాక్,సౌదీ అరేబియా, ఇజ్రాయిల్,టర్కీ వంటి పలు దేశాల కలయికతో ఆసియా ,ఆఫ్రికా,ఐరోపా ఖండాల మధ్య నున్న ఒక భౌగోళిక రాజకీయ ప్రదేశమే "మధ్య ప్రాచ్యం". సహజ వనరులు పుష్కలంగా లభించే మధ్య ప్రాచ్యంలో చమురు కోసం సాగే యుద్ధంలో తరచూ సంఘర్షణలు ఏర్పడుతున్నాయి. హోర్ముజ్ స్ట్రయిట్,సూయజ్ కాలువలు ఈ జియో పొలిటికల్ ఏరియాలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. మధ్య ప్రాచ్యంలో ఇరాన్-ఇజ్రాయిల్, ఇజ్రాయిల్ పాలస్తీనాల మధ్య చాలా కాలం నుండి తీవ్ర స్థాయిలో ఉద్రిక్తతలు ఏర్పడి,అపారమైన ప్రాణ నష్టం సంభవిస్తున్నది. చమురుతో పాటు సున్నితమైన మత పరమైన అంశాల చుట్టూ ఇక్కడ రాజకీయాలు తిరుగుతున్నాయి. ప్రస్తుతం ఇరాన్ అమెరికాల మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనే ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ట్రంప్ ఆదేశాలకు తలొగ్గి అమెరికాతో ఇరాన్ ఒప్పందం చేసుకోవడానికి ఇష్టపడక పోవడమే ప్రస్తుత పరిస్థితులకు కారణం.పశ్చిమాసియాకు అమెరికా తన బలగాలను పంపించింది. ఇరాన్ కు పది రోజులు గడువు విధించిన అమెరికా ఇరాన్ పై యుద్ధానికి సన్నద్ధం చేస్తూ ఇప్పటికే యుద్ధ విమానాలను, క్షిపణులను యుద్ధ నౌకలను,సైనిక బలగాలను ఇరాన్ సరిహద్దుల వద్ద మోహరించింది.ఇరాన్ లో యుద్ధ భేరీ మోగుతున్న తరుణంలో వివిధ కారణాల రీత్యా ఇరాన్ లో ఉన్న భారతీయులందరినీ స్వదేశం తిరిగి రావాలని భారత ప్రభుత్వం ఆదేశించడం ఇరాన్ లో నెల కొన్న తీవ్రమైన ఉద్రిక్త పరిస్థితులకు అద్దం పడుతున్నది. ఇరాన్ విషయంలో అమెరికా కోపోద్రేకం తీవ్రస్థాయికి చేరింది. ఇజ్రాయిల్ ఇరాన్ ల మధ్య గతంలో జరిగిన సంఘర్షణ తీవ్ర స్థాయికి చేరిన తరుణంలో అమెరికా మధ్యవర్తిత్వం వహించి తాత్కాలిక శాంతి ఒప్పందం కుదిర్చింది. అయితే ప్రస్తుతం ఇరాన్,అమెరికాలు పరస్పరం వాగ్బాణాలు సంధించుకుంటున్నాయి. ఇరాన్ పై దాడికి సిద్ధమంటూ అమెరికా హెచ్చరించడం, అందుకు ఇరాన్ ట్రంప్ ను హేళన చేస్తూ అమెరికా గతంలో ఇరాక్,ఆఫ్ఘన్ ల విషయంలో చేసిన దారుణాల గురించి, ఆయా దేశాల్లో అమెరికా బలగాల అర్ధాంతర ఉపసంహరణ గురించి పేర్కొంటూ ఇరాన్ ను అమెరికా ఏమీ చేయలేదని పేర్కొనడం ద్వారా సమస్య మరింత జటిలంగా మారింది.అమెరికా తన స్వీయ ప్రయోజనాల కోసం,ఇజ్రాయిల్ ప్రయోజనాల కోసం ఇరాన్ పై యుద్ధం చేయడానికి ఉవ్విళ్ళూరుతున్నది. అమెరికా ఇరాన్ ల మధ్య సంఘర్షణ ప్రపంచ దేశాలకు సంకటంగా మారింది. ఇప్పటికే గత నాలుగు సంవత్సరాలుగా రష్యా ఉక్రెయిన్ ల మధ్య జరుగుతున్న యుద్ధం వలన లక్షలాది ప్రాణాలు గాలిలో కలిసి పోయాయి.తమ దేశ ప్రజలకు బంగారు భవిష్యత్తును నిర్మించడం మాని, ప్రజా ప్రయోజనాలను విస్మరించి, రష్యా ఉక్రెయిన్లు పోటీ పోటీగా శ్మశాన వాటికలను నిర్మిస్తున్నాయి.రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అంతటి స్థాయిలో జరుగుతున్న రష్యా ఉక్రెయిన్ల మధ్య భీకర పోరు 5 వ సంవత్సరంలోకి



ప్రవేశించింది.రష్యా మూడవ ప్రపంచ యుద్ధాన్ని ప్రారంభించిందని, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఇప్పటికే అన్యోపదేశంగా మాట్లాడడం గమనార్హం. అణ్వాయుధాల ఊసు లేకుండా సాగుతున్న ఈ యుద్ధం లో ఇరుపక్షాల సైనికులు,పౌరులు లక్షల సంఖ్యలో మరణిస్తే, ఇక అణ్వస్త్ర యుద్ధం జరిగితే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించలేం. ఇరాన్ అమెరికాల మధ్య యుద్ధం సంభవిస్తే ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయో ఊహించడం కష్టం. ఇరాన్ నిజంగా అణ్వస్త్రాలను కలిగి ఉందా? యురేనియం శుద్ధి కార్యక్రమం పేరుతో అణ్వస్త్రాలను తయారు చేస్తున్నదా? అసలు నిజం ఏమిటి? ఇరాన్ ప్రజలు అయతుల్లా ఖమేనీ పట్ల తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తూ, టెహ్రాన్ లో అడుగు పెట్టాలని అమెరికా ను స్వయంగా ఇరాన్ ప్రజలే అభ్యర్థించడం, తిరుగుబాటు బావుటా ఎగరేయడం గమనార్హం. ఎంతో ఆయుధ సంపత్తి గల అమెరికా ను ధిక్కరిస్తూ,యుద్ధానికి సై అంటూ ఇరాన్ ట్రంప్ కు ప్రతి హెచ్చరికలు చేయడం లో గల ఆంతర్య మేమిటి? అమెరికా ఇరాన్ ల మధ్య చర్చలు ఫలిస్తాయా? సంధి కుదురుతుందా? లేదా రణమే జరుగుతుందా? ఇరాన్ అమెరికా ల మధ్య యుద్ధం వలన మధ్య ప్రాచ్యంలో ఊహించని మారణ కాండ జరిగే అవకాశాలున్నాయి. ఈ సందర్భంలోనే ఇరాన్ తన శత్రు దేశమైన ఇజ్రాయిల్ ను లక్ష్యం గా చేసుకుని దాడులు చేసే అవకాశముంది. ఇదే గనుక జరిగితే హమాస్ తిరిగి విజృంభిస్తుంది. ఇన్ని అవాంఛనీయ పరిణామాలు ప్రపంచానికి అవసరమా? యుద్ధాలను ప్రపంచ ప్రజలు కోరుకుంటున్నారా? పాలకులే పిశాచాలై తమ వ్యక్తిగత ప్రతిష్ట కోసం, తమ అహాన్ని సంతృప్తి పరచుకోవడానికి ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం క్షంతవ్యం కాదు.ఇప్పటికే ఇజ్రాయిల్ హమాస్ ల మధ్య జరిగిన దారుణ మారణకాండలో ఎంతో మంది మృత్యువు ఒడికి చేరుకున్నారు. గాజా రక్తపు మరకలు ఇంకా అలాగే ఉన్నాయి. గాజాలో ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. ఎంతో విధ్వంసం తర్వాత గాజా కోసం శాంతి మండలి ఏర్పాటు చేయడం విడ్డూరం. పాలస్తీనా సమస్య కు పరిష్కారం దొరకడం దుర్లభంగా మారింది. ఇప్పటికే ఇరాన్ ఇజ్రాయిల్ మధ్య కాల్పుల విరమణకు చెమటోడ్చిన ట్రంప్ తిరిగి ఇరాన్ పై కయ్యానికి కాలుదువ్వుతూ, మరో ప్రపంచ యుద్ధానికి మళ్ళించడం పలు దేశాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది.అమెరికా తమపై ఎలాంటి చర్య తీసుకున్నా,తమ వైపు నుండి కూడా తీవ్రమైన ప్రతిచర్య ఉంటుందని ఇప్పటికే టెహ్రాన్ హెచ్చరించింది.యురేనియం శుద్ధి చేయడం వంటి కార్యక్రమాలు ఆపాలని,క్షిపణి ప్రయోగాలను నిలుపుదల చేయాలని, హిజ్బుల్లా,హమాస్ వంటి తీవ్రవాద సంస్థలకు సాయం నిలిపి వేయాలనే అమెరికా డిమాండ్ ను ఇరాన్ అంగీకరించడం లేదు.ఇరాన్ సుప్రీం ఖమేనీ అమెరికా చర్యలను తీవ్రంగా పరిగణించి, అమెరికా భరతం పడతామని పేర్కొనడం రాబోవు విపత్కర పరిణామాలను సూచిస్తున్నాయి.ఇరాన్ భూగర్భంలో అణ్వాయుధ కేంద్రాలున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి.ఒక వైపు చర్చలు మరో వైపు యుద్ధసన్నాహాలతో మధ్య ప్రాచ్యం లో భీతావహ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇరాన్ తన కీలక స్థానాలను పరిరక్షించు కోవడానికి ప్రయత్నిస్తున్నది. హర్ముజ్ జలసంధిని మూసివేస్తానని ఇరాన్ హెచ్చరిస్తున్నది.167 కి. మీ పొడవైన హర్ముజ్ జలసంధి వందల బిలియన్ల ఇంధన వ్యవహారానికి కీలకం. వాణిజ్యానికి అత్యంత కీలక మైన హర్ముజ్ జలసంధి పర్షియన్ సింధుశాఖకు,ఒమన్ సింధు శాఖకు మధ్యగల అంతర్జాతీయ సముద్ర మార్గం. హర్ముజ్ జలసంధి అత్యంత వ్యూహాత్మక మైన ప్రాంతం. ముడి చమురు ఎగుమతులకు అత్యంత కీలకమైన హర్ముజ్ జలసంధి ఇరాన్ అధీనంలో కొనసాగుతున్నది. ఈ జలసంధిని గనుక మూసి వేస్తే, పలు దేశాలకు చమురు సరఫరా నిలిచి పోయే ప్రమాదముంది. రష్యా, చైనాలు ఇరాన్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం తగదని అమెరికా కు హితబోధ చేస్తున్నాయి. చైనాకు ఇరాన్ పెద్ద మొత్తంలో ఆయిల్ సరఫరా చేస్తున్నది. ఈ కారణం కూడా అమెరికా ఆగ్రహానికి కారణం కావచ్చు.రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోవద్దని ఇప్పటికే అమెరికా భారత్ ను హెచ్చరించింది. ఇరాన్ పై అమెరికా దాడి చేస్తే, ఇరాన్ గనుక హర్ముజ్ స్ట్రయిట్ ను మూసి వేస్తే ప్రపంచానికి ఆయిల్ సరఫరా నిలిచి పోవచ్చు. అన్ని అవరోధాలను అధిగమించి, అమెరికా ఇరాన్ పై దాడి చేసి, ఆక్రమించుకుంటే పరిస్థితులు మరో విధంగా ఉంటాయి. వెనిజువేలా మాదిరిగా ఇరాన్ కూడా అమెరికా వశమైతే అమెరికా కు అది పెద్ద శుభవార్తే కాగలదు. కేవలం ఆయుధాలతో,సాంకేతిక పరిజ్ఞానంతో,సుంకాలతో ప్రపంచాన్ని కొల్లగొడుతున్న అమెరికా ప్రస్తుతం ఇతర దేశాల చమురు క్షేత్రాలను కొల్లగొట్టడానికే ఆసక్తి చూపుతున్నది. ఇరాన్-అమెరికా ల మధ్య యుద్ధం గనుక సంభవిస్తే చైనా కూడా పూర్తిగా రష్యా చమురు దిగుమతులపై ఆధార పడక తప్పదు. ఏది ఏమైనప్పటికీ వర్తమాన ప్రపంచంలో జరుగుతున్న అమెరికా ప్రేరిత యుద్ధాలు ఇతర దేశాలసంపదను కొల్లగొట్టడానికే. అమెరికా చర్యలు మూడవ ప్రపంచ యుద్ధానికి దారి తీసే అవకాశాలను కొట్టి పారేయలేం.

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు ,మోటివేషనల్ స్పీకర్)

ఒక మహిళ గౌరవంపై జరిగిన దాడి



భవానీ వేముల
8297444333



ఒక మహిళను ఎంతగా కించపరచగలరో అంతగా కించపరిచిన రోజులను మనం చూసాం. ఆమె పేరు వినిపించగానే సోషల్ మీడియా వేదికలపై ట్రోలింగ్ ప్రారంభమయ్యేలా పరిస్థితులు సృష్టించబడ్డాయి. రాజకీయ ఆరోపణల పేరుతో ఒక మహిళ వ్యక్తిత్వాన్ని లక్ష్యంగా చేసుకుని చేసిన విమర్శలు, వ్యాఖ్యలు, ఎగతాళులు సమాజానికి అద్దం పట్టాయి. ఆ మహిళ ఎవరో కాదు కల్వకుంట్ల కవిత.
ఆమెపై "లిక్కర్ రాణి" అనే పదాన్ని ప్రయోగిస్తూ చేసిన వ్యాఖ్యలు కేవలం రాజకీయ విమర్శలు మాత్రమే కాదు; అవి ఒక మహిళ గౌరవాన్ని బహిరంగంగా అవమానించేందుకు చేసిన ప్రయత్నాలు. ప్రతి సారి ఆ పదం వినిపించినప్పుడు, అది ఆమె గుండెల్లో ముల్లులా గుచ్చుకున్నదనే విషయం అనుభూతి చెందగలిగిన వారు చాలా తక్కువ. రాజకీయాల్లో ఆరోపణలు సహజం. విమర్శలు కూడా సహజం. కానీ ఒక మహిళను లక్ష్యంగా చేసుకుని, ఆమె ఆత్మగౌరవాన్ని వీధుల్లో లాగడం అనేది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. వాదనలు ఆలోచనల పై జరగాలి, వ్యక్తిత్వాలపై కాదు. కానీ ఇక్కడ వ్యక్తిత్వమే లక్ష్యమైంది. ఆమె నవ్వు వెనుక ఎంత బాధ దాగి ఉందో ఎవరికి తెలుసు? కుటుంబం ఎంత మానసిక ఒత్తిడిని అనుభవించిందో ఎవరూ ఊహించలేరు. ముఖ్యంగా ఒక తండ్రి హృదయం ఎంతగా కలత చెందిందో ఊహించడమే కష్టం. ఆ సమయంలో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఒక తండ్రిగా నిలబడి, "నా బిడ్డ కడిగిన ముత్యం లా బయటకు వస్తుంది" అని ధైర్యంగా ప్రకటించారు.
ఆ మాటల్లో ఒక నాయకుడి ధైర్యం మాత్రమే కాదు — ఒక తండ్రి నమ్మకం, ఒక కుటుంబం బాధ, ఒక సత్యంపై ఉన్న విశ్వాసం దాగి ఉన్నాయి. కాలం గడిచింది. ఆరోపణలు, విచారణలు, కోర్టు వాదనలు — అన్నీ జరిగాయి. చివరకు న్యాయస్థానం తీర్పు వెలువడిన రోజు శుక్రవారం, అది కేవలం చట్టపరమైన నిర్ణయం మాత్రమే కాదు; ఒక మహిళ కన్నీళ్లకు లభించిన న్యాయం అని భావించినవారు అనేక మంది.
ఆమె ఏడ్చింది — కానీ తల వంచలేదు.
ఆమెను మాటలతో గాయపరిచారు — కానీ ఆమె గౌరవాన్ని కోల్పోలేదు. ఆమెను ఎగతాళి చేశారు — కానీ ఆమె ధైర్యాన్ని దెబ్బతీయలేకపోయారు. ఒక మహిళను అవమానించినప్పుడు చప్పట్లు కొట్టిన వారు, ఈ రోజు నిశ్శబ్దంగా ఉన్నారు. ఎందుకంటే సత్యం గెలిచినప్పుడు అబద్ధాలకు స్వరం ఉండదు. కర్మను ఎగతాళి చేసిన వారు గుర్తుంచుకోవాలి — కర్మ ఆలస్యంగా వస్తుంది, కానీ ఖచ్చితంగా వస్తుంది. ఇది ఒక కేసు ముగింపు మాత్రమే కాదు. ఇది ఒక అన్యాయంపై గెలుపు. ఇది ఒక మహిళ ఆత్మగౌరవానికి వచ్చిన విజయం. సమాజానికి ఒక గుర్తుచేసే సందేశం — మహిళను రాజకీయ ఆయుధంగా ఉపయోగించకండి. ఆమె వ్యక్తిత్వాన్ని అవమానించకండి. వాదనలు విధానాలపై జరగాలి, వ్యక్తుల గౌరవంపై కాదు. ఒక ఆడబిడ్డను ఏడిపించారు. కానీ ఆమె నిలబడ్డ తీరు, ధైర్యం, నిశ్శబ్ద సహనం — ఇవే చివరకు గెలిచాయి.
మన అధినేత్రి పై పెట్టిన తప్పుడు కేసును డిల్లీ కోర్టు కొట్టివేయడం న్యాయానికి జరిగిన విజయం. ఇది జాగృతి కుటుంబ సభ్యులందరికీ పండుగరోజు లాంటిది. రాష్ట్రవ్యాప్తంగా శ్రేణులు సంబరాలు నిర్వహించి నాయకురాలికి శుభాకాంక్షలు తెలియజేయాలి" అని పిలుపునిచ్చారు.

కన్నీళ్లు గెలిచాయి.
ధైర్యం గెలిచింది.
సత్యం నిలిచింది.
సత్యమేవ జయతే.

(వ్యాస రచయిత తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి)



సైన్స్‌లో మహిళల శక్తి వికసిత్ భారత్ దిశగా ముందడుగు



వేల్పుల మహేందర్
9912775834

భారతదేశం ఫిబ్రవరి 28, 2026 న జాతీయ సైన్స్ దినోత్సవంను దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంది. ఈ ఏడాది జాతీయ సైన్స్ దినోత్సవానికి ఎంపికైన ఇతివృత్తం "సైన్స్‌లో మహిళలు: విక్సిత్ భారత్‌ను ఉత్ప్రేరకపరచడం". అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో మహిళా శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ఆవిష్కర్తల కీలక పాత్రను ఈ ఇతివృత్తం ప్రత్యేకంగా హైలైట్ చేసింది. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకోవడానికి గల చారిత్రక నేపథ్యం విశేషమైనది. 1928 ఫిబ్రవరి 28న భారతీయ భౌతిక శాస్త్రవేత్త సర్ సివి రామన్ కాంతి వికీర్ణానికి సంబంధించిన రామన్ ఎఫెక్ట్ అనే విప్లవాత్మక ఆవిష్కరణను చేశారు. ఈ ఆవిష్కరణకు గాను ఆయనకు 1930లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. ఈ గొప్ప శాస్త్రీయ ఘట్టాన్ని స్మరించుకుంటూ భారత ప్రభుత్వం 1986లో ఫిబ్రవరి 28ను జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రకటించగా, 1987 నుంచి దేశవ్యాప్తంగా అధికారికంగా వేడుకలు నిర్వహించబడుతున్నాయి. 2026 జాతీయ సైన్స్ దినోత్సవ ఇతివృత్తం STEM (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం) రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించింది. పరిశోధన, సాంకేతికత, ఆవిష్కరణల్లో మహిళల నాయకత్వాన్ని గుర్తించడం, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడం, మహిళలు నేతృత్వంలోని శాస్త్రీయ పురోగతిని ముందుకు తీసుకెళ్లడం ఈ థీమ్ ప్రధాన లక్ష్యాలుగా నిలిచాయి. ఇది "విక్షిత్ భారత్ 2047" దార్శనికతకు అనుగుణంగా ఉందని నిపుణులు అభిప్రాయపడ్డారు.

భారత్ దేశ శాస్త్రీయ పాత్ర

భారతదేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రపంచంలోనే ముందంజలో నిలుస్తోంది. అంతరిక్ష పరిశోధనల్లో ISRO సాధించిన విజయాలు, అణు శక్తి రంగంలో పురోగతి, వైద్య పరిశోధనలు, డిజిటల్ టెక్నాలజీ, సమాచార సాంకేతికతలో భారత ఐటీ రంగం ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. ఇవన్నీ దేశాభివృద్ధికి శాస్త్రం ఎంత కీలకమో స్పష్టంగా నిరూపిస్తున్నాయి.

సమాజానికి సందేశం:

జాతీయ సైన్స్ దినోత్సవం ద్వారా భారత్ యువతకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తోంది. తార్కిక ఆలోచన, పరిశోధన, ఆవిష్కరణల ద్వారానే దేశ పురోగతి సాధ్యం. శాస్త్రీయ దృక్పథం పెంపొందితేనే మూఢనమ్మకాలకు చెక్ పెట్టి, స్థిరమైన అభివృద్ధి సాధించవచ్చని ఈ దినోత్సవం గుర్తు చేస్తుంది.

ముగింపు:

జాతీయ సైన్స్ దినోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదు. ఇది శాస్త్రం-సమానత్వం-ఆవిష్కరణల సమన్వయంతో భారత్ విక్సిత్ దేశంగా మారే దిశగా సాగుతున్న ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుంది. సైన్స్‌తోనే దేశ అభివృద్ధి, మహిళల సమాన భాగస్వామ్యంతోనే విక్సిత్ భారత్ సాధ్యం అనే బలమైన సందేశంతో జాతీయ సైన్స్ దినోత్సవం 2026 దేశవ్యాప్తంగా ఉత్సాహంగా ముగిసింది.

.(వ్యాసకర్త సైన్స్ అధ్యాపకులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917
ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం





ముత్తంగిలో 'రంజాన్ తోఫా' పంపిణీ

- మైనార్టీ నాయకులు అబేద్ ఆధ్వర్యంలో 400 మంది కి తోఫా ల పంపిణీ
- ముఖ్య అతిధి గా పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 27 : ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే రంజాన్ పవిత్రం మాసం సందర్భంగా 400 మంది నిరుపేదలకు బట్టలు, నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ముత్తంగి డివిజన్ పరిధిలోని రామరాజునగర్ లో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అబేద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల అబేద్ అలీ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు మాజీ జెడ్పిటిసి శ్రీకాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ ఉపేందర్, మెరాజ్, రామకృష్ణ, రవి, తదితరులు పాల్గొన్నారు.

మార్చి 13న ఎమ్మెల్యే గూడెం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

రంజాన్ పవిత్ర మాసం పురస్కరించుకుని వచ్చే నెల మార్చి 13వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు పటాన్ చెరు పట్టణంలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో నియోజకవర్గ స్థాయి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని ముస్లిం మత పెద్దలు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఇఫ్తార్ విందు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఇఫ్తార్ విందు ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మతపెద్దల సూచనలకు అనుగుణంగా మార్చి 13వ తేదీన ఇఫ్తార్ విందు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ముస్లిం సోదర సోదరీమణులందరూ భారీ సంఖ్యలో విందుకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. గత 27వ సంవత్సరాలుగా రంజాన్ పురస్కరించుకొని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ముస్లింలకు తగు ప్రాధాన్యత అందించడంతోపాటు సొంత నిధులతో మసీదులు, ఆశుర్ఖానాలు నిర్మించి వారి ఆర్థిక అభ్యున్నతికి పాటుపాడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ముస్లిం మత పెద్దలు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణపై వివక్షతో వ్యవహరిస్తున్న బీజేపీ

- కేంద్ర మంత్రి బండి పై మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 27: పొన్నం ప్రభాకర్ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. కరీంనగర్ లో ఆయన మీడియా తో మాట్లాడుతూ న్యాయస్థానాల పట్ల గౌరవం ఉన్న వ్యక్తి అలాంటి వ్యాఖ్యలు చేయరని ఆయన అన్నారు. తమకు వ్యక్తిగతంగా ఎవరిపైనా వ్యతిరేకత లేదని స్పష్టం చేశారు.హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పుల అనంతరం సంబంధిత స్థలం ప్రభుత్వానిదని స్పష్టమైందని, ఆ భూమిలో అక్రమంగా ఉన్న వారిని తొలగించే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. కోర్టు తీర్పుల ప్రతులను కేంద్ర మంత్రికి పంపిస్తామని, వాటిని పరిశీలిస్తే పూర్తి అవగాహన వస్తుందని చెప్పారు. రాజకీయ ఆరోపణలు చేయేటప్పుడు బాధ్యతతో వ్యవహరించాలన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు రుణభారంలో భాగంగా ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో రూ.48 వేల కోట్ల కిస్తీలు చెల్లించిందని వెల్లడించారు. అయితే గత రెండు బడ్జెట్లలో కేంద్రం నుంచి ఒక్క రూపాయి ప్రత్యేక నిధులు కూడా రాలేదని విమర్శించారు. ఫెడరల్ వ్యవస్థలో తెలంగాణ వంటి రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, కనీసం పొరుగు ఆంధ్రప్రదేశ్ కు ఇచ్చే నిధుల్లో సగం అయినా తెలంగాణకు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అభివృద్ధికి కృషి చేయాల్సిన కేంద్ర మంత్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం దురదృష్టకరమని అన్నారు. తెలంగాణపై వివక్షపూరితంగా వ్యవహరిస్తున్న బీజేపీ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి వెళ్తున్న నిధులు, తిరిగి వస్తున్న వాటి వివరాలు వెల్లడించాలని కోరారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి నిధులు సాధించాలని కేంద్ర మంత్రిని కోరుతున్నామని చెప్పారు.రైతు భరోసా సహా ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేస్తున్నామని తెలిపారు. కోర్టు తీర్పులను ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిందేనని, రాజకీయ కక్ష సాధింపులో బీజేపీ ముందుందని విమర్శించారు. కవితకు కోర్టులో పూర్తి క్లియర్ చిట్ వచ్చినా అపవాదులు మాత్రం మిగిలి ఉన్నాయని, ఆ విషయంపై ప్రజలే తగిన సమాధానం చెబుతారని పేర్కొన్నారు.



ప్రాంతం, భాష ఏదైనా మనం భారతీయులం

- గీతం ఫెస్ట్ లో ప్రముఖ సినీ దర్శకుడు బోయపాటి శ్రీను.

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 27 : మనం ఏ ప్రాంతం, కులం, భాష ఏదైనా, ముందుగా మనమంతా భారతీయులమని, అది నేటి యువత గుర్తెరిగి మసలుకోవాలని ప్రముఖ సినీ దర్శకుడు బోయపాటి శ్రీను హితబోధ చేశారు. హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న వార్షిక వేడుక ప్రమాణ2026 ప్రారంభోత్సవంలో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారతీయులుగా మనమంతా గర్వించాలని, ప్రపంచానికే దారిచూపిన, దిశానిర్దేశనం చేసిన దేశం మనదన్నారు. రాళ్ళను నీటిపై తేలేలా చేసినా, నీటితో దీపాలు వెలిగించినా, రాళ్ళలో నుంచి రాగాన్ని పలికించినా.. అది భారతీయులకే సాధ్యమని చెప్పారు. మన విశ్వగురువుగా ఎదుగుతున్నామంటే, దానికి కారణం మన సంస్కృతి, ధర్మమని ఆయన పేర్కొన్నారు. ఆధునిక పోకడలు (ట్రెండ్) ఆకర్షిస్తున్నా, మన ఆలోచనా ధోరణి (మైండ్ సెట్) మారకూడదని, మన సంస్కృతి, విలువలను మరువకూడదని విద్యార్థులకు బోయపాటి హితవు పలికారు. తల్లిదండ్రులు, గురువులను మరవొద్దని, నమ్ముకున్న ఆశయాన్ని వదలొద్దని, అవరోధాలు ఎదురైనా ముందడుగే వేయాలని, వైఫల్యాలకు వెరవొద్దని సూచించారు. అప్పుడే మంచి భవిష్యత్తు సాధ్యపడుతుందని చెప్పారు. చదువు వల్ల సంస్కారం అలవడాలని, అహంకారం (ఈగో), ఒత్తిడి (స్ట్రెస్), లేదా మాదక ద్రవ్యాల (డ్రగ్స్) వంటి దురలవాట్లు కాదని స్పష్టీకరించారు. 'కల్తీకి ఏదీ అనర్హం కానట్టు' వ్యవస్థ తయారైందని, చివరకు మనం తినే పళ్ళు కూడా కల్తీ కావడం పట్ల ఆయన విచారం వెలిబుచ్చారు. యువత సంఘటితమై, నడుం బిగించి కల్తీ నిరోధానికి ఉద్యుక్తులు కావాలని బోయపాటి సూచించారు. సెల్ ఫోన్ చేతులో ఉన్న ప్రతి విద్యార్థి ముంగిట యావత్తు ప్రపంచం ఉంటుందని, ఆ జ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలే తప్ప, అది ప్రగతికి ప్రతిబంధకంగా మారకూడదని బోయపాటి శ్రీను హెచ్చరించారు. అలాగే అందివస్తున్న అధునాతన సాంకేతికత, కృత్రిమ మేధస్సు (ఏఐ) రెండువైపులా పదునున్న కత్తి వంటిదని, దాన్ని మన పురోగతికే జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే సామాజిక మాధ్యమం (సోషల్ మీడియా) ఎంతవరకు వాడాలనే దానిపై ప్రతి విద్యార్థికీ ఓ అవగాహన ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు, ప్రముఖ నేపథ్య గాయని గీతామాధురి పాటల కచేరీ, ది డెక్కన్ ప్రాజెక్ట్, ది హెడ్ లైనర్ బ్యాండ్, డీజే నందజీ యొక్క హైఎనర్జీ డీజే సెట్ వంటివి విద్యార్థులను అలరిస్తున్నాయి.



మంత్రి సీతక్కను సన్మానించిన డీసీసీ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 27 : నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క ను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ లు ఘనంగా సన్మానించారు. సంఘటన్ శ్రీజన్ అభియాన్ లో భాగంగా శిక్షణా శిభిరంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడులు తమ ప్రెసెంటేషన్ సమర్పించి, అనంతరం శాలువాతో సత్కరించారు.



కరీంనగర్ కలెక్టర్‌గా చిత్రా మిశ్రా

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 27: కరీంనగర్ జిల్లా నూతన కలెక్టర్ గా చిత్రా మిశ్రా శుక్రవారం కలెక్టరేట్ ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చిత్రా మిశ్రాను కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఏవో సుధాకర్ , పలువురు జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.



చెన్నూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

- మంత్రి వివేక్

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 27: చెన్నూర్ పట్టణమును రాష్ట్రంలో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దామని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం నూతనంగా ఎంపికైన మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాదారు. సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలలో గెలుపొందిన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికలలో గెలుపొందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలలో గెలుపొందిన కౌన్సిలర్లు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించే దిశగా పని చేయాలన్నారు. చెన్నూరులో మున్సిపాలిటీ లో సుమారు రూపాయలు 50 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు కు శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. అనేక వార్డులలో బోర్వెల్స్ సిసి రోడ్లు సైడ్ డ్రైన్స్ పనులు జరుగుతున్నట్టు పేర్కొన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు అభివృద్ధి పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు గత ప్రభుత్వం మిషన్ భగీరథ పేరిట నిధులను దుర్వినియోగం చేసిందని విమర్శించారు పట్టణ ప్రజలకు శుద్ధ జలాల పథకాన్ని గోదావరి నీటిని అందిస్తామన్నారు. త్వరలో రోడ్ల విస్తరణ చేపడతామని తెలిపారు పట్నంలోని కుల సంఘాల భవన నిర్మాణానికి ఇప్పటికే నిధులు కేటాయించినట్లు తెలిపారు. మరో ఆరు నెలల్లో గోదావరిఖని అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు మారెమ్మ వాడలో రహదారి సమస్యను పరిష్కరించామని గుర్తు చేశారు. 100 కొత్త ఇంద్ర మహిళను మంజూరు చేసినట్లు తెలిపారు. దేవులవాడ బబ్బెరు చిలక గ్రామ రైతులకు సుమారు 18 కోట్ల పరిహారం మంజూరు చేసి పంపిణీ చేసినట్లు వివరించారు. మే నెలలో వంద పడక లా ఆసుపత్రిని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఒక కోటి 20 లక్షల రూపాయలతో స్మశాన వాటిక అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు చెన్నూరులో ప్రతి వార్డులో సమన్వయంతో పనిచేసి మునిసిపాలిటీ రాష్ట్రంలో ఆదర్శ మునిసిపాలిటీగా తీర్చిదిద్దామని అన్నారు.

'హైడ్రోఫోనిక్ గంజా' స్వాధీనం

- 86 గ్రాముల హైడ్రోపోనిక్ గంజా స్వాధీనం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , ఫిబ్రవరి 27: సంగారెడ్డి జిల్లాలో డ్రగ్స్ మాఫియాపై మెదక్ ఎన్ఫోర్స్మెంట్ బృందం మెరుపు దాడి నిర్వహించి అత్యంత శక్తివంతమైన హైడ్రోపోనిక్ గంజాను స్వాధీనం చేసుకుంది. సంగారెడ్డి జిల్లా చరిత్రలో ఈ రకమైన మత్తు పదార్థం పట్టుబడటం ఇదే తొలిసారి కావడం విశేషం అని అన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు, ప్రొహిబిషన్ & ఎక్సైజ్ డైరెక్టర్ షానవాజ్ కాసిమ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ ఆపరేషన్ చేపట్టబడిందని, మెదక్ డీసీ జె.హరి కిషన్ పర్యవేక్షణలో, ఏసీ జి. శ్రీనివాస్ రెడ్డి మరియు అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె. శ్రీనివాస్ రావు నేతృత్వంలో బృందం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి శుక్రవారం రోజు తెల్లవారుజాము మునిపల్లి మండలం కమ్ కోల్ టోల్ ప్లాజా వద్ద గోవా నుండి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేయగా, కేరళకు చెందిన బ్రెయిన్ బాబు (30) అనే వ్యక్తివద్ద 86 గ్రాముల హైడ్రోపోనిక్ గంజా లభ్యమైంది. నిందితుడు వృత్తిరీత్యా ఈవెంట్ ఆర్గనైజర్‌గా పనిచేస్తూ, పార్టీల కోసం ఈ మత్తు పదార్థాన్ని తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. హైడ్రోపోనిక్ గంజా ప్రత్యేకత : సాధారణ గంజాయికి భిన్నంగా, మట్టి లేకుండా నీరు మరియు పోషకాల సహాయంతో గదుల్లో ప్రత్యేక పద్ధతిలో పండిస్తున్న ఈ రకం గంజాలో మత్తును కలిగించే టిహెచ్ సి % శాతం అధికంగా ఉంటుంది. స్వాధీనం చేసిన 86 గ్రాముల విలువ సుమారు రూ. 3.5 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఇది గ్రాముకు సుమారు రూ. 4,000 ఉంటుందని అన్నారు. డ్రగ్ ను పట్టుకునే ఆపరేషన్‌లో పాల్గొన్న అధికారులు సీఐ. బి. గాంధీ నాయక్, ఎస్ఐ.బి. యాదయ్య, హెడ్ కానిస్టేబుల్ ఎం.డి. అలీమ్, కానిస్టేబుళ్లు అమ్మతుల్ కరీమ్, రామారావు నాయక్, ఎం. గోపాల్, వివేక్, ముజమ్మిల్, వి. కావ్యశ్రీ వున్నారు. నిందితుడిపై (ఎన్ డి పి ఎస్ చట్టం, 1985) కింద కేసు నమోదు చేసి, ఈ ముఠా వెనుక ఉన్న ఇతర వ్యక్తులపై దర్యాప్తు వేగవంతం చేసినట్లు అధికారులు తెలిపారు. విజయవంతంగా ఆపరేషన్ పూర్తి చేసిన సిబ్బందిని ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.



మా పార్టీని రాజకీయంగా నశింపజేయాలనే ఉద్దేశంతోనే తప్పుడు కేసులు పెట్టారు. సీబీఐ, ఈడీ వంటి కేంద్ర సంస్థలను ఆయుధాలుగా ఉపయోగించి మమ్మల్ని జైలుకు పంపించారు. నా కుటుంబసభ్యులు కూడా చాలా ఇబ్బందులు పడ్డారు. మద్యం కుంభకోణం పూర్తిగా ఫేక్ కేసు. మా నిజాయతీపై మచ్చ వేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేసింది. ఢిల్లీలో తక్షణమే ఎన్నికలు నిర్వహించాలి. అందులో భారతీయ జనతా పార్టీ 10 సీట్లకంటే ఎక్కువ గెలిస్తే రాజకీయాల నుంచి తప్పకుంటా.

- ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్

ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చదువును ఆపొద్దు

- విద్యార్థినులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉద్బోధ
- కోటగల్లి బాలికల పాఠశాలలో పునర్వినియోగ సానిటరీ ప్యాడ్లు పంపిణీ



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 27 : ఎన్ని ఇబ్బందులు ఎదురైనా...చదువును అర్థాంతరంగా ఆపొద్దని, ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో చక్కగా స్థిరపడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి విద్యార్థినులకు ఉద్బోధ చేశారు. నిజామాబాద్ నగరంలోని కోటగల్లి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు కలెక్టర్ చేతుల మీదుగా శుక్రవారం పునర్వినియోగ సానిటరీ ప్యాడ్లు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలు సంయుక్తంగా 60 వేల పునర్వినియోగ సానిటరీ ప్యాడ్లను బాలికలకు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం కోటగల్లి బాలికల పాఠశాలలో 650 మంది బాలికలకు సానిటరీ ప్యాడ్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఈ ప్యాడ్లను ఏడాది కాలం పాటు పునర్వినియోగం చేసుకోవచ్చని, వీటిని వాడిన అనంతరం శుభ్రపర్చుకుని చక్కగా ఆరబెట్టుకుంటే, తిరిగి వాటినే వినియోగించుకోవచ్చని సూచించారు. నెలసరి విషయంలో బాలికలు ఆందోళనకు లోను కావద్దని, మహిళలకు ఇది ప్రకృతి సహజంగా జరిగే పరిణామమని అన్నారు. హార్మోన్ల సమతుల్యత లోపిస్తే వైద్య పరీక్షలు జరిపించుకోవాలని సూచించారు. బాలికలు వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ, ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జంక్ ఫుడ్ కు దూరంగా ఉండాలని, బలవర్ధకమైన ఆహార పదార్థాలు తీసుకోవాలని అన్నారు. విద్యతోనే సమాజంలో ఉన్నత స్థానం, గౌరవం లభిస్తుందని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా విద్యార్జనను కొనసాగించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్.బీ.ఐ రీజినల్ మేనేజర్ మహేశ్వరం, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ సునీల్, పాఠశాల హెచ్.ఎం సాయరెడ్డి, ఎస్.బీ.ఐ, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఘనంగా శిశు విహార్ హై స్కూల్ వార్షికోత్సవం

- హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 27 : పఠాన్ చెరు నియోజక వర్గ పరిధి కర్దనూర్ లోని శిశు విహార్ హై స్కూల్ 23 వ వార్షికోత్సవ వేడుకలు, కిడ్స్ కార్నివల్ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. స్కూల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించిన ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిధి గా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శిశువిహార్ హై స్కూల్ యాజమాన్యం, కరస్పాండెంట్ బీనా అనిల్ పిల్లయ్ శాలువా కప్పి ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే ప్రణాళిక బద్ధంగా చదివితే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసల జల్లులు కురిపించారు. పాఠశాల విద్యా రంగంలో, క్రీడల్లో, యాక్టివిటీ ఆధారిత బోధనలో మరియు సైన్స్ ఫెయిర్ లలో ప్రతిభ కనబరుస్తోందని ప్రశంసించారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల కృషిని అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో విద్యార్థుల తల్లి, దండ్రులు, స్థానిక నాయకులు, యువకులు హాజరయ్యారు.

ప్రాంతీయం



విశ్వకర్మల ద్వారానే దేశ ఆర్థిక అభివృద్ధి సాధ్యం

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

ప్రతిపక్షం,ప్రతినిధి మెదక్ ఫిబ్రవరి 27: విశ్వకర్మల ద్వారా దేశ ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..అంతరించిపోతున్న కళావృత్తులు, కళలను , చేతివృత్తు1లను ప్రోత్సహించి విశ్వకర్మల ఆర్థిక అభివృద్ధికి చేదోడు అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. విశ్వకర్మల పథకం ద్వారా లబ్ధి పొందుతున్న లబ్ధిదారులతో మాట్లాడారు. వారికి త్వరలోనే టూల్ కిట్స్ అందిస్తామన్నారు. విశ్వకర్మల ద్వారానే దేశ ఆర్థిక అభివృద్ధి సాధ్యమని తెలియజేశారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. విశ్వకర్మల ఆర్థిక అభివృద్ధి ఈ పథకం ద్వారా సాధ్యమన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ గుల్షన్ సింగ్, లీడ్ బ్యాంకు మేనేజర్ బాపూజీ, విశ్వకర్మ పథకం లబ్ధిదారులు పాల్గొన్నారు.



నూతన కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలిపిన టీఎన్జీవోలు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 26 :మెదక్ జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన ప్రతిమాసింగ్ ను టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూల మొక్కతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ గా పని చేసినప్పుడు సహకరించిన ఉద్యోగులు మునుముందు కూడా అదే విధంగా ప్రభుత్వ యంత్రాంగం ఉద్యోగులు సహకరించి జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. కలిసిన వారిలో జిల్లా కార్యదర్శి మినికి రాజ్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గాండ్ల అనురాధ, జిల్లా సహాధ్యక్షులు ఇక్బాల్ పాషా, ఉపాధ్యక్షులు పజాలుద్దీన్, రఘునాథరావు, లీల, సంయుక్త కార్యదర్శులు శంకర్, శివాజీ, కిరణ్ కుమార్, రాధా, ఆర్గనైజింగ్ కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు సతీష్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంతోష్, చంద్రహాస్, సహ అధ్యక్షుడు శ్రీకాంత్, స్వాతి తదితర ఉద్యోగులు ఉన్నారు.



ఎలక్ట్రిక్ బైకుల వినియోగంతో పెట్రోల్, డీజిల్ బడ్జెట్ ఆదా

- ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 27: పెట్రోల్, డీజిల్ ధరల రేట్లు పెరుగుతున్నాయని, ఈ పరిస్థితుల్లో ఎలక్ట్రిక్ మోటార్ వాహనాలు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు పట్టణంలో లక్ష్మి "ఇవి అబ్ ఎలక్ట్రిక్ బైక్ షోరూం" ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ కాలుష్యం నుంచి బయట పడాలం టే ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ వాహనాల వైపు దృష్టి పెట్టాలన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల రేట్లు పెరుగుతున్నాయని, కాలుష్యం నుంచి బయటపడాలం టే ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ వాహనాల వైపు దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ చందన రవి వైస్ చైర్మన్ కళ్యాణాకర్ పద్మా బాయ్ నర్సింగ్ రావు వార్డ్ మెంబర్ కప్ప మమత పోచయ్య మౌనగరి రాజు కొల్గూర్ సర్పంచ్ గొడుగు జ్యోతి స్వామి బెజగమ సర్పంచ్ గోపాల్ నీరుడు స్వామి, ప్రొప్రైటర్ ఆంజనేయులు, సేల్స్ మెన్ నాగులు శ్రీకాంత్ తదితరులు షోరూం పాల్గొన్నారు.



పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షా శిబిరం

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 27: రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమంలో భాగంగా, శుక్రవారం రోజు గజ్వేల్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని గజ్వేల్ ఏసిపి నర్సింలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యంగా హెవీ వెహికిల్స్ అయిన బస్సు, లారీ, ఆటో మరియు ఇతర గూడ్స్ వాహన డ్రైవర్ల కోసం కంటి పరీక్ష క్యాంపు నిర్వహించడం జరిగిందని ఎసిపి పేర్కొన్నారు. అంతే కాకుండా అవసరమైన వారికి కంటి అద్దాలు తోపాటు మందులు ఉచితంగా అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ టౌన్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ ,గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి , ఎస్ ఐ ప్రేమ్ కుమార్ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ప్రతిపక్షం, దౌల్తాబాద్, ఫిబ్రవరి 27: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన దౌల్తాబాద్ మండల పరిధిలోని సూరంపల్లి గ్రామంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. దౌల్తాబాద్ ఎస్సై అరుణ్ కుమార్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. దౌల్తాబాద్ మండల పరిధిలోని సూరంపల్లి గ్రామానికి చెందిన పయ్యావుల యాదగిరి(56) వృత్తిరీత్యా మంగలి వృత్తి నిర్వహిస్తూ భార్య చంద్రకళ, కూతురు నందిని, కుమారుడు నాగరాజు తో కలిసి జీవనం సాగిస్తున్నాడు. పయ్యావుల యాదగిరి కి అదే గ్రామంలో చంద్రకళ తో దాదాపు 20 ఏళ్ల క్రితం వివాహమయ్యింది. పయ్యావుల యాదగిరి, చంద్రకళ దంపతులకు ఒక కూతురు, కుమారుడు కలరు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ విషయాలపై దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి 10 గంటల సమయంలో యాదగిరి మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్య చంద్రకళతో గొడవ పడ్డాడని కుటుంబ సభ్యులు తెలిపారు. పరిస్థితి విషమించడంతో భార్య చంద్రకళ, కూతురు నందిని, కొడుకు నాగరాజు, కలిసి సమీప బంధువుల ఇంటికి వెళ్లారు.



శుక్రవారం ఉదయం సుమారు 6.15 గంటల సమయంలో భార్య చంద్రకళ తిరిగి ఇంటికి వచ్చి ఇంటి తలుపులు తీసి చూసేసరికి గదిలో నైలాన్ తాడుతో యాదగిరి ఉరి వేసుకుని ఉన్నాడు. వెంటనే కుమారుడికి సమాచారం అందించగా అప్పటికే యాదగిరి మృతి చెందినట్లు గుర్తించారు. యాదగిరి మృతికి కుటుంబ కలహాలే కారణమని భార్య చంద్రకళ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు లో తెలిపింది. ఈ మేరకు దౌల్తాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు.

రైతుబంధు రాదు.. ఎరువులు అందవు

- రైతుల గోస పట్టని కాంగ్రెస్ ప్రభుత్వం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు



ప్రతిపక్షం, నంగునూరు, ఫిబ్రవరి 27: రైతు బంధు రాక.. యూరియా సకాలంలో అందక రైతులు నానా అవస్థలు పడుతున్నారని మాజీ మంత్రి సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. రైతులు ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నంగునూరు మండలంలోని మైసంపల్లిలో పెద్దమ్మతల్లి తృతీయ వార్షికోత్సవం, వెంకటాపూర్ లో అభయాంజనేయ స్వామి ప్రథమ వార్షికోత్సవంలో శుక్రవారం హరీశ్ రావు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ పెద్దమ్మతల్లి దయతో, అభయాంజనేయ స్వామి ఆశీస్సులతో మళ్ళీ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రైతులకు మంచి రోజులు వస్తాయన్నారు. మైసంపల్లి గ్రామం అంటే తనకు ఎంతో ఇష్టమని గ్రామాన్ని అన్ని రంగాల అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పెద్దమ్మ తల్లి గుడికి రూ.10 లక్షలు రూపాయలు, లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి రూ.50లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణంతో పాటు 100 శాతం సీసీ రహదారి నిర్మాణం, 32 రెండు పడక గదులు ఇళ్లు నిర్మించామన్నారు. కాళేశ్వరం జలాలతో గ్రామంలో పంటలు బాగా పండుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో సమగ్ర గ్రామ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. వెంకటాపూర్ లోని అభయాంజనేయ దేవస్థానం అర్చకులు హరీశ్ రావును వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వెంకటాపూర్ గ్రామం రైతులు జిల్లాలోని ఆదర్శవంతమైన రైతులని తెలిపారు. గతంలో గ్రామంలో 500 ఎకరాల రైతుల భూములు మురదాబాద్ పరిధిలో ఉండడంతో ఆన్లైన్ కాలేదన్నారు. దీంతో రైతు బంధు రాక చాలా ఇబ్బంది పడ్డారని చెప్పారు. సంవత్సరం పాటు కష్టపడి అందరి భూములు ఆన్లైన్ చేపించామన్నారు. దీంతో రైతులకు రైతు బంధు వేయించామన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు అభయాంజనేయ స్వామికి కిరీటం రెండో వార్షికోత్సవం లోపు చేయిస్తామన్నారు. గ్రామ పంచాయతీకి నూతన భవనం మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వేలేటి రాధాకృష్ణ శర్మ, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, వేముల వెంకటరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లింగం గౌడ్, ఎడ్ల సోమిరెడ్డి, కోల రమేశ్ గౌడ్ , ఎల్లంకి మహిపాల్ రెడ్డి, కూతురు రాజిరెడ్డి, బద్దిపడగ కృష్ణారెడ్డి, గ్రామాల స్థానిక సర్పంచులు రేకుల పల్లి సంతోష్ రెడ్డి, సోమిరెడ్డి నరేష్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు బెదురు తిరుపతి, బీఆర్ఎస్ కార్యకర్తలు, ముదిరాజ్ సంఘం నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



అభివృద్ధి,సంక్షేమంలో మెదక్ జిల్లాను ముందంజలో ఉంచాలి

- మంత్రి దామోదర్ రాజనర్సింహ

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 27 : మెదక్ జిల్లాను అభివృద్ధి సంక్షేమ పథకాల్లో ముందంజలో ఉండాలని మంత్రి మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తో తెలిపారు. హైదరాబాద్లోని మంత్రి నివాసంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పూల మొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను తప్పకుండా నెరవేర్చుతానని తెలిపారు. పేద ప్రజలకు సేవ చేస్తానన్నారు.



ఫార్మర్ రిజిస్ట్రీపై కలెక్టర్ అసహనం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 27: జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... కొన్ని గ్రామాలలో ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తిగా జరుపుకోలేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఫార్మర్ రిజిస్ట్రీను 100శాతం పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.కలెక్టర్ ఆదేశాల ప్రకారం, డివిజన్ వారీగా ఏడిఏలు (ADA), క్లస్టర్ వారీగా ఏఓలు (AO) ఏఈఓలు (AEO) తరచుగా మానిటర్ చేస్తూ, ప్రతి దశలో ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తిగా నడిచేలా చూడాలని సూచించారు. రైతులతో సమీక్షలు, గ్రామ పంచాయతీల సమావేశాల ద్వారా స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి రైతులతో చర్చించి ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేయాలని తెలిపారు. పంట నమోదు ప్రక్రియను సోమవారం నుండి అత్యంత పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరం ఉన్నట్లు గుర్తించారు.సమీక్షలో జిల్లా వ్యవసాయశాఖ అధికారులు, ముఖ్యంగా స్వరూప్ రాణి ,ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఎస్సీ ఎస్టీలను బలి పశువులు చేయకండి

- పోలీసులను హెచ్చరించిన రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 26 : ఎన్నికల సమయంలో జరిగే వివాదాలను ఆశ్రయి తీసుకొని ఎస్సీ ఎస్టీలపై తప్పుడు కేసులు నమోదు చేయడం తగదని ఎస్సీ ఎస్టీలను బలిపశులు చేయదని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పోలీస్ అధికారులకు సూచించారు శనివారం నాడు మెదక్ జిల్లా కలెక్టరేట్ లో జరిగిన సమీక్ష సమావేశంలో చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ మెదక్ పట్టణంలోని పిట్లం బేస్ లో జరిగిన ఎన్నికల గొడవలో ఎస్సీలపైనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు పెట్టడం తగదన్నారు. ఎస్సీ ఎస్టీలపై దాడులు జరిగితే అరికట్టవలసిన పోలీసులే తప్పుడు కేసు నమోదు చేస్తే రక్షణ ఎవరు కల్పిస్తారని ప్రశ్నించారు. మెదక్ పట్టణంలో నీ పిట్లం బేస్ లో ఎన్నికలకు గొడవలు ఎస్సీలపైనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి జైలు పాలు చేశారని డిబిఎఫ్ నేత శంకర్ చైర్మన్ విన్నవించారు. ఎందుకు స్పందించిన చైర్మన్ మాట్లాడుతూఎస్సీ ఎస్టీ అట్రాసి చట్టాన్ని అబ్యాస్ పాలు చేయొద్దని తెలిపారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల పై అలసత్వం వద్దని సూచించారు. నర్సాపూర్ పెద్ద చింతకుంట గిరిజనుల పై జరిగిన దాడి కేసు విచారణలో ఐవోలు మార్చాలని చైర్మన్ ఎస్పీని ఆదేశించారు.జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవనానికి మార్చి 26 వరకు స్థలానికి కేటాయించి భవన నిర్మాణం ప్రారంభించాలని ఆర్డీవోను ఆదేశించారు. హవేలి ఘనపూర్ తదితర గ్రామాలలో నెలకొన్న భూమి సమస్యలను 45 రోజులలో పరిష్కరించాలని ఆదేశించారు నరసాపూర్ మండలం మమతాబాద్ లోని గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి వసతులపై నాణ్యమైన భోజనం పై ఎస్సీ ఎస్టీ కమిషన్కు నివేదిక సమర్పించాలని జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని ఆదేశించారు. బాధితులకు నష్ట పరిహారము అందించడంలో నిర్లక్ష్యాన్ని విడనాడాలన్నారు. ఎస్సీ ఎస్టీ బాధితులకు ప్రారంభం కింద డబుల్ బెడ్ రూమ్ లను కేటాయించాలని చైర్మన్ ఆదేశించారు. హత్య అత్యాచారం సాంఘిక విష్కరణ తదితర కేసులలో బాధితులకు పక్క ఇండ్లను అందించాలని కోరారు. ప్రతి చరిత్రలోనే రాష్ట్రా ఎస్సీ ఎస్టీ కమిషన్ ఆధ్వర్యంలో సైబరాబాద్ మల్కాజ్గిరి హైదరాబాద్ జిల్లాలలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ బాధితులకు డబుల్ బెడ్ రూమ్లను పంపిణీ చేశామని తెలిపారు.వివిధ శాఖ లు అమలు చేస్తున్న పథకాలపై సమీక్ష నిర్వహించారు. మెదక్ పట్టణంలోని సి కార్పొరేషన్ నూతన దుకాణాల సముదాయాలను తక్షణమే నిర్మాణాలను ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్రఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్ జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ తదిత దళిత సంఘాల నాయకులు డివిఎంసి సభ్యులు పాల్గొన్నారు.

డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- ప్రయాణికుల ప్రాణ భద్రత, డ్రైవర్ల బాధ్యతే
- జిల్లా అదనపు ఎస్పీ మహేందర్




ప్రతిపక్షం,మెదక్ టౌన్,ఫిబ్రవరి 27: ప్రయాణికుల ప్రాణ భద్రత డ్రైవర్ల బాధ్యతేనని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు.రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా చేపట్టిన “అరైవ్ అలైవ్ ” రెండవ దశ కార్యక్రమం మెదక్ జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోంది.ఇందులో భాగంగా మెదక్ పట్టణంలోని బస్సు డిపోలో మెదక్ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో బస్సు డ్రైవర్ల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని శుక్రవారం మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ప్రారంభించారు.స్థానిక వైద్యుల సహకరంతో బస్సు డ్రైవర్లకు సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించి,దూరదృష్టి లోపం,చూపు మందగించడం,కంటి ఒత్తిడి వంటి సమస్యలు ఉన్నడ్రైవర్లను గుర్తించారు.చూపు సమస్యలు ఉన్న డ్రైవర్లకు ఉచితంగా కళ్ళజోళ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. ఆర్టీసీబస్సు డ్రైవర్లు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కోరారు.రోడ్డు భద్రత నియమాలను పాటించడంతో ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు.రోడ్డు భద్రతా నియమాలు,ట్రాఫిక్ చట్టాలు, డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులపై అవగాహన కల్పించారు.అధిక వేగం,లేన్ క్రమశిక్షణ లోపం, అలసటతో వాహనం నడపడం వంటి అంశాలు ప్రమాదాలకు దారితీస్తాయని వివరించారు. డ్రైవర్లలో చూపు సంబంధిత సమస్యలు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణంగా మారుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి డ్రైవర్ కాలానుగుణంగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మెదక్ డిపో మేనేజర్ సురేఖ, మెదక్ టౌన్ సీఐ మహేష్, ఆర్టీసీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాను రోల్ మోడల్ గా నిలిపిన కలెక్టర్ రాహుల్ రాజ్

- జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 27 : వినూత్నం.. విప్లవాత్మకంగా మెదక్ జిల్లాను రోల్ మోడల్ గా నిలిపి రికార్డు సొంతం చేసుకునేలా పాలనపై రాహుల్ రాజ్ తనదైన ముద్ర.. వేసుకునేలా బృహత్తర కార్యక్రమాలతో అద్భుత ఫలితాలు.. సాధించడం ఉద్యోగులు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో గతంలో రెండు సంవత్సరాలగా మెదక్ కలెక్టర్ గా పనిచేసి బదిలీపై సహకార శాఖ ప్రత్యేక కమిషనర్ గా హైదరాబాద్ వెళ్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్ వీడ్కోలు సమావేశం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లా అధికారులు వక్తలు రాహుల్ రాజ్ గారి సేవలను కొనియాడుతూ అభినందనలు తెలిపారు. జిల్లా ఎస్పీ డి.వి శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలీస్ రెవిన్యూ శాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రతి అంశంలో సహాయ సహకారాలు అందించారని గుర్తు చేశారు. జిల్లా లో శాంతి భద్రతకు తన వంతు కృషిగా చేశారని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో పనిచేసిన కాలంలో జిల్లా అధికారులు సమన్వయం మరువలేనిదని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేసేందుకు విశేష కృషి చేసినట్లు ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం జిల్లా అధికారులు సిబ్బంది పూల బొకేలు శాలువాలతో. ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎస్ డివి శ్రీనివాసరావు, డిఆర్ఓ భుజంగరావు,అదనపు ఎస్పీ మహేందర్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఆర్డీవోలు, మెదక్ రమాదేవి, తూఫ్రాన్ జై చంద్ర రెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దొంతి నరేందర్, జనరల్ సెక్రెటరీ రాజ్ కుమార్, రెవిన్యూ అసోసియేషన్ అధ్యక్షులు మహేందర్, జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్ రెడ్డి జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఇతర జిల్లా అధికారులు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పేదలందరికీ 2029 నాటికి ఉచితంగా ఇళ్లు, ఇళ్ల స్థలాలు అందిస్తాం. ఇళ్లు రాని వాళ్లంతా దరఖాస్తు చేసుకోవాలి. 2.20 లక్షల కుటుంబాలకు ఇంటి జాగాలు లేవు. వారికి పట్టణ ప్రాంతాల్లో 2, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఉచితంగా కేటాయిస్తాం. ఈ ఏడాదిలో 10.63 లక్షల ఇళ్లలో గృహ ప్రవేశాలు చేయిస్తాం. గత పాలకులు హౌసింగ్‌లో అక్రమాలు చేశారు. ఇందుకు బాధ్యులను శిక్షిస్తాం.

- అసెంబ్లీలో ఏపీ సీఎం చంద్రబాబు

బబ్బర్ షేర్ ను ప్రజలు చెప్పులతో కొట్టారు

- కాంగ్రెస్ కార్యకర్తలపై మండిపడ్డ ప్రధాని మోడీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ఢిల్లీ వేదికగా ఇటీవల జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పి నిరసన చేయడాన్ని ప్రధాని నరేంద్రమోదీ తప్పుబట్టారు. కాంగ్రెస్ ఎన్ని కుతంత్రాలు చేసినప్పటికీ తమ ప్రభుత్వం మాత్రం భారతదేశ అభివృద్ధికి కృషి చేస్తూనే ఉంటుందని మోదీ అన్నారు. అలాగే దేశంలో కాంగ్రెస్ పార్టీకి మిలీనియల్స్ ఇప్పటికే తగిన గుణపాఠం చెప్పారని, ఇప్పుడు జెన్ జీ కూడా ఇదే చేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఓ జాతీయ మీడియా శుక్రవారం నిర్వహించిన భారత్ రైజింగ్ సమ్మిట్‌లో పాల్గొన్న మోదీ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. కాగా, చొక్కాలు విప్పి నిరసన చేపట్టిన తమ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల లోక్‌సభలో పూర్తి మద్దతు ఇచ్చారు. వాళ్లను 'బబ్బర్ షేర్స్' (పులులు) అని అభివర్ణించారు. దీనిపై మోదీ స్పందించారు. కాంగ్రెస్ సింహాలకు ప్రజలు చెప్పులతో బుద్ధి చెప్పారని అన్నారు. 'కాంగ్రెస్ బబ్బర్ షేర్స్ తాము చేసిన పనికి ప్రజలతో చెప్పు దెబ్బలు తిని వెళ్లారు' అని మోదీ విమర్శించారు. కాంగ్రెస్ తనకు కావలసినన్ని బట్టలు చింపివేయగలదు. కానీ మేం భారత్ అభివృద్ధి కోసమే పని చేస్తాం. AI సమ్మిట్‌లో కాంగ్రెస్ చొక్కాలు విప్పడంతో, విదేశీ అతిథుల ముందు మీ అసమర్థత బయటపడింది' అని మోదీ వ్యాఖ్యానించారు.





విశ్వ వీక్షణం





ఈఎంఐ ఊబిలో! సంతోషం ఎండమావి!

హైదరాబాద్ లోని ఓ సాధారణ అపార్ట్మెంట్. గడియారంలో ముళ్ళు పదిహేను నిమిషాల క్రితమే పదకొండు దాటాయి. కానీ, ఆ ఇంట్లో ఇంకా నిశ్శబ్దం అడుగుపెట్టలేదు. ల్యాప్టాప్ నీలి వెలుగులో నిమగ్నమై ఉన్న రవికుమార్, వంటింట్లో రేపటి పనుల వేటలో ఉన్న సుజాత, హోంవర్క్ పుస్తకాల్లో మునిగిపోయిన వాళ్ళ అమ్మాయి. ఇదీ ఆ ఇంటి చిత్రం. ఇది కేవలం ఒక రవికుమార్ కథ మాత్రమే కాదు, నిద్రలేని రాత్రులను సాక్షిగా చేసుకుని మెరుగైన రేపటి కోసం శ్రమిస్తున్న కోట్లాది తెలుగు మధ్యతరగతి కుటుంబాల నిత్య జీవన దృశ్యం అసలు భారతదేశంలో మధ్యతరగతి అంటే ఎవరు? ఆర్థికవేత్తలు లెక్కగట్టే అంకెల గారడీలో వీరు దొరకరు.

డాక్టర్
సూర్యదేవర
రామకృష్ణ
9490754169



నెలాఖరు వస్తుందంటే మొదలయ్యే గుబులులో, పిల్లల భవిష్యత్తు కోసం గుండెల్లో దాచుకునే భయాల్లో, తమను తాము చంపుకుంటూ చేసే త్యాగాల్లోనే ఆ అసలు నిర్వచనం దాగి ఉంది. నెలకు యాభై వేల నుంచి రెండు లక్షల దాకా సంపాదించే ఈ వర్గం అటు పేదరికానికి దూరంగా, ఇటు సంపన్నతకు చేరువ కాలేక మధ్యలో కొట్టుమిట్టాడే ఒక విచిత్రమైన బఫర్ జోన్ . వీరి జీవితం సంతోషానికి, నిరంతర పోరాటానికి మధ్య జరిగే ఒక తీరని దోబూచులాట. విజయవాడలోని ఒక బ్యాంకులో పని చేసే శ్రీనివాసరావు గారిని పలకరిస్తే ఒక నవ్వు నవ్వి, ఏముంది బాబూ, మాది ఈ .ఎం .ఐ ల (EMI) జీవితం అయిపోయింది అంటారు. ఆ నవ్వులో హాస్యం కంటే, ఒక రకమైన నిస్సహాయతే ఎక్కువగా ధ్వనిస్తుంది. గూడు కోసం అరవై వేలు, కారు కోసం ఇరవై రెండు వేలు, పిల్లల చదువుల కోసం మరో పన్నెండు వేలు,ఇలా లక్షా పది వేల జీతంలో తొంభై నాలుగు వేలు బ్యాంకు గడప దాటకుండానే కరిగిపోతున్నాయి. చేతిలో మిగిలే ఆ పదహారు వేల చిల్లరతోనే కిరాణా కొట్టు లెక్కలు, కూరగాయల బేరాలు, కరెంటు బిల్లులు, మందుల ఖర్చులు అన్నీ గడవాలి. కత్తి మీద సాములా సాగుతున్న ఈ ప్రయాణంలో సంతోషం ఎక్కడో వెతుక్కోవాల్సి వస్తోంది. అప్పట్లో సొంత ఇల్లు కొన్నప్పుడు నా సంతోషానికి హద్దుల్లేవు. అదొక కల సాకారమైన క్షణం. కానీ ఇప్పుడు అదే ఇల్లు నన్ను నిద్ర పోనివ్వడం లేదు అంటూ నిట్టూరుస్తారు శ్రీనివాసరావు. ఇది కేవలం ఆయన ఒక్కరి ఆవేదన కాదు రెండు తెలుగు రాష్ట్రాల్లోని లక్షలాది మధ్యతరగతి గడపల వెనుక వినిపిస్తున్న మూగ రోదన. గణాంకాలు చూస్తే గగుర్పాటు కలుగుతుంది ప్రతి కుటుంబం సగటున రెండు మూడు రకాల రుణాలతో కుస్తీ పడుతోంది. గృహ రుణం తీరకముందే ఇంటి మరమ్మతులు, పిల్లల చదువులు, అనారోగ్యాలు ఇలా ఒక అప్పును కప్పడానికి ఇంకో అప్పు పుట్టించక తప్పని స్థితి. ఒక్కసారి ఈ అప్పుల చక్రం లో చిక్కుకుంటే, బయటపడటం ఎండమావిలో నీటి కోసం వెతకడమే! కొడుకు కొత్త సంసారం సాఫీగా సాగాలని, తన జీవితకాలపు పొదుపునంతా ధారబోశారు మల్లేష్ గారు. చాలీచాలక మరో మూడు లక్షల అప్పు చేసి మరీ ఇల్లు కొనిపించారు. కానీ ఆ ప్రేమ ఇప్పుడు ఆయన ముసలితనానికి భారమై కూర్చుంది. పిల్లలు బాగుండాలని కోరుకోవడం తప్పా? అన్నట్లుగా ఆయన అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం దొరకదు. విశ్రాంతి తీసుకోవాల్సిన వయసులో, అప్పుల చక్రం నుంచి బయటపడటానికి ఆయన పడుతున్న తాపత్రయం చూస్తుంటే, మధ్యతరగతి తండ్రుల త్యాగాలు ఎంత భారమో అర్థమవుతుంది. మధ్యతరగతి వాడికి EMI అనేది ఒక ఆర్థిక ఒప్పందం మాత్రమే కాదు, అదొక మానసిక ఒత్తిడి. జీతం పడ్డ మరుక్షణమే అది మాయమైపోతుందని తెలిసినప్పుడు కలిగే ఆ వేదన వర్ణనాతీతం. అరకొర మిగిలిన డబ్బుతో కుటుంబాన్ని నెట్టుకురావడం కత్తి మీద సాము లాంటిదే! ఇంట్లో చిన్న శుభకార్యం చేయాలన్నా బడ్జెట్ అనే భూతం భయపెడుతుంటుంది. ప్రతి అడుగులోనూ, ప్రతి ఖర్చులోనూ లెక్కలు వేసుకుంటూ బతకడం వల్ల మనసు అలిసిపోతుంది. ఈ నిరంతర పోరాటంలో అప్పుడప్పుడు జీవితం అంటే ఇంతేనా? అన్న నిరాశ నిశ్శబ్దంగా గుండెను పీక్కుతింటుంది. కార్పొరేట్ ప్రపంచంలో లేఆఫ్ అంటే కేవలం ఉద్యోగం పోవడం కాదు, ఒక కుటుంబం పునాదులు కదలడం. గత రెండేళ్లుగా ఐటీ, ప్రైవేట్ రంగాలను కుదిపేస్తున్న ఈ తుపాను ఇంకా శాంతించలేదు. ముప్పై రెండేళ్ల ప్రశాంత్ అనుభవం వింటే గుండె బరువెక్కుతుంది. హెడ్ఆర్ పిలిచారు పర్సనల్ మీటింగ్ అన్నారు అంతే, మనిషి మాయమైపోయాడు అని తను చెబుతుంటే, అది ఒక వ్యక్తి కథ కాదు, ఒక తరం ఎదుర్కొంటున్న అనిశ్చితి అనిపిస్తుంది. హోమ్ లోన్లు, కుటుంబ అవసరాల మధ్య నలుగుతున్న ప్రశాంత్ లాంటి ఎంతోమందికి, ఆఫీసు నుంచి వచ్చే ప్రతి ఈమెయిల్ ఒక హెచ్చరికలాగే కనిపిస్తోంది. ఆ నిరంతర భయమే వారి రాత్రులను నిద్ర లేకుండా చేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగం అంటే అందరూ లైఫ్ సెటిల్ అనుకుంటారు, కానీ ఆ నిశ్చింత వెనుక మారుమూల ప్రాంతాలకు బదిలీ అవుతామన్న భయం నీడలా వెంటాడుతూనే ఉంటుంది. పిల్లల చదువులు అస్తవ్యస్తమవుతాయన్న ఆందోళన, భార్యాభర్తలు విడివిడిగా ఉండాల్సిన దుస్థితి ఇవన్నీ ఇచ్చే మానసిక కృంగుబాటు అంతా ఇంతా కాదు. గుంటూరులో ఉపాధ్యాయురాలిగా పనిచేసే లక్ష్మీదేవి గారి కథే అందుకు సాక్ష్యం. మూడేళ్ల క్రితం ఆమెకు నెల్లూరుకు బదిలీ అయింది. అటు భర్త హైదరాబాద్లో ఉద్యోగం, ఇటు తన డ్యూటీ నెల్లూరులో మధ్యలో పిల్లల భవిష్యత్తు! నెలల తరబడి సాగిన ఆ తర్జన భర్జనలు, కుటుంబం పడిన ఆవేదన లక్ష్మీదేవి గారి ఆరోగ్యంపై దెబ్బకొట్టాయి. ఆ మానసిక ఒత్తిడి కాస్తా ఆమెకు శాశ్వతంగా బీపీ (రక్తపోటు)ని మిగిల్చింది. మధ్యతరగతి మనిషిని ఇప్పటికే అప్పులు, బదిలీలు వేధిస్తుంటే ఇప్పుడు 'ఏఐ' (AI) రూపంలో మరో కొత్త భయం ముంచుకొస్తోంది. రేపు నా కుర్చీలో మనిషి ఉంటాడా? లేక ఒక సాఫ్ట్వేర్ కూర్చుంటుందా? అన్న సందేహం ఇప్పుడు కేవలం ఐటీ ఇంజనీర్లదే కాదు అకౌంటెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, చివరకు కస్టమర్ కేర్ ప్రతినిధులను కూడా వెంటాడుతోంది. కాలంతో పోటీ పడి నైపుణ్యాలను మార్చుకోవాలి (Upskill) కానీ దానికి కావాల్సిన సమయం ఆఫీసు పనిలో కరిగిపోతుంటే, దానికి పెట్టాల్సిన పెట్టుబడి ఇంటి ఖర్చుల్లో ఆవిరైపోతోంది. ఈ అనిశ్చితి మధ్యతరగతి మనిషిని నిరంతరం ఒక తెలియని యుద్ధక్షేత్రంలో నిలబెడుతోంది. మధ్యతరగతి ఇల్లు ఒక నిశ్శబ్ద యుద్ధ క్షేత్రం. ఆ ఇంటి తలుపులు మూసుకుంటే లోపల ఎన్ని అలజడులో, ఎన్ని కన్నీటి ధారలో పక్కింటి వారికి కూడా తెలియవు. పిల్లల భవిష్యత్తు కోసం ఆరాటం ఒకవైపు వృద్ధ తల్లిదండ్రుల ఆరోగ్యం కోసం తపన మరోవైపు. కాకినాడలో లెక్చరర్గా పనిచేసే అనిల్ కుమార్ గారిని చూస్తే అంతా బాగుంది అనుకుంటారు. కానీ, ఆయన ఒంటరిగా ఉన్నప్పుడు తన మనసులోని భారమంతా బయటపెడతారు. అమ్మ ఆపరేషన్, నాన్న మందులు, పిల్లల ఫీజులు లక్షన్నర ఆదాయం ఉన్నా, నెలాఖరుకు చేతిలో చిల్లిగవ్వ మిగలదు. పిల్లలకు మంచి జీవితం ఇవ్వాలనే కోరిక, తల్లిదండ్రులను కళ్లల్లో పెట్టుకోవాలనే బాధ్యత ఈ రెండింటి మధ్య నా మనసు నిరంతరం ఒక ఊయలలా కొట్టుకుంటూనే ఉంటుంది అంటారు అనిల్. ఇది కేవలం ఆయన ఆవేదన కాదు, అనుబంధాలకు, ఆర్థిక ఇబ్బందులకు మధ్య నలిగిపోతున్న లక్షలాది మంది సామాన్యుల అంతర్మథనం. మధ్యతరగతి ఇంట్లో చదువు అనేది కేవలం జ్ఞానార్జన కాదు, అదొక భారీ పెట్టుబడి. NEET సీటు రాలేదని బాధపడేలోపే, డొనేషన్ల భయం వెంటాడుతుంది. శకుంతల గారు తన కొడుకు భవిష్యత్తు కోసం తీసుకున్న మూడు లక్షల అప్పు, ఆమె జీవితంలో మరో ఆరేళ్ల శ్రమను రాసి పెట్టింది. చదువుల వేటలో సామాన్యుడు చిక్కిన శల్యమవుతున్నాడు. ఈ మొత్తం ఒత్తిడిలో మహిళల వాటా మరింత ఎక్కువ. ఇల్లు, ఆఫీసు, బంధుత్వాలు ఇలా అన్నింటినీ సమన్వయం చేసుకుంటూ సాగే ప్రయాణంలో ఆమె ప్రాధాన్యతలు ఎప్పుడూ చివరి వరుసలోనే ఉంటాయి. లోపల ఎంత అలజడి ఉన్నా, కుటుంబం కోసం మౌనంగా భరిస్తూ, అంతా బాగుంది అనిపించేలా సర్దుకుపోవడం ఒక్క మధ్యతరగతి మహిళకే సాధ్యం. అవాంతరాలు ఎదురైనప్పుడు విరిగిపోవడం కాదు, మరింత పట్టుదలగా నిలబడటం మధ్యతరగతి మనిషికి వెన్నతో పెట్టిన విద్య. రవికుమార్ కళ్లలోని నిద్రను, శ్రీనివాసరావు ఒంట్లోని అలసటను, శకుంతల గారి విరామ సమయాన్ని వీటన్నింటినీ వారు తమ కుటుంబం కోసం బలి ఇస్తున్నారు. లక్ష్మీదేవి గారిలా ఎక్కడికి బదిలీ అయినా సరే, తమ ప్రపంచాన్ని తామే నిర్మించుకోగల శక్తి వీరి సొంతం. లోకం వీరిని మధ్యతరగతి అని పిలవచ్చు కానీ, త్యాగాల విషయంలో వీరు మహోన్నతులు. ప్రతి అడుగులోనూ ఒక వెత ఉన్నా, ఆ వెతను జయించే ఒక ఆశ వీరికి తోడుగా ఉంటుంది. ఆ ఆశే వారిని ముందుకు నడిపించే ఇంధనం. నిజానికి ఈ దేశం ముందుకు నడుస్తోంది అంటే అది అందమైన బంగ్లాల్లో నివసించే వారి వల్ల కాదు ప్రతి నెలా EMIల కోసం ఆరాటపడే, ఉద్యోగం ఎప్పుడు ఊడుతుందో అన్న భయంతో కునారిల్లే సగటు మధ్యతరగతి మనిషి రెక్కల కష్టం వల్ల! ఈ సమాజం ఆ మనిషికి ఇవ్వాల్సిన గౌరవాన్ని ఇవ్వాలి. ప్రభుత్వాలు ఆ మనిషి సమస్యల పట్ల కనికరం చూపాలి. బ్యాంకులు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు అన్నీ కలిసి ఆ సామాన్యుడిని దోచుకోకుండా అండగా నిలవాలి. నిజమే, మధ్యతరగతి బతుకు EMIల సంకెళ్లలో, ఉద్యోగ భయాల నీడలో, బాధ్యతల మంటల్లో కాలిపోతోంది. కానీ, ఆ నిప్పుల కొలిమిలో కూడా అతడిని నడిపించేది ఒక్కటే కల తన బిడ్డలకైనా తనకంటే మెరుగైన భవిష్యత్తు ఉండాలి. ఆ ఒక్క ఆశ కోసమే అతడు ప్రతిరోజూ మళ్లీ పుడతాడు ఆ కలను నిజం చేసేందుకు అతడు చేసే నిరంతర పోరాటమే ఈ తరపు మహాభారతం. ఆ మనిషికి సలాం చేయాల్సిందే!



ఢిల్లీ ఎన్నికలు జరపండి

బీజేపీకి 10 కంటే ఎక్కువ సీట్లొస్తే రాజకీయాల నుండి తప్పుకుంటా

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలకు సత్తా ఉంటే తక్షణం ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించాలని, బీజేపీకి 10 కంటే ఎక్కువ సీట్లు వస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకొంటానని మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాం నుంచి బయటపడ్డ అనంతరం అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మోదీ, అమిత్ షా ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. ఢిల్లీలో అధికారం చేపట్టిన బీజేపీ ఈ ప్రాంతాన్ని సమస్యల్లో నెట్టిందన్నారు. కేంద్ర పాలిత ప్రాంతమైన ఢిల్లీలో బీజేపీ అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే. "ఢిల్లీని బీజేపీ నాశనం చేసింది. ఇక్కడ అధికారం చేపట్టాలనే ఆశతో మూడు కోట్ల ఢిల్లీ ప్రజల్ని ఇబ్బందుల్లో నెట్టారు. కావాలంటే ఢిల్లీ ప్రజల్ని వెళ్లి అడగండి. ఢిల్లీలో వాయు కాలుష్యం, యమునా నది కాలుష్యం, రోడ్లు ధ్వంసం సహా అనేక సమస్యలున్నాయి. నేను ఈ రోజు మోదీకి ఛాలెంజ్ చేస్తున్నా. మీకు సత్తా ఉంటే ఢిల్లీకి మళ్లీ ఎన్నికలు నిర్వహించండి. బీజేపీకి 10 కంటే ఎక్కువ సీట్లు వస్తే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొంటా. ఢిల్లీ ప్రజలు మీ పాలనతో విసిగిపోయారు. ఆమ్ ఆద్మీ పార్టీని అధికారం నుంచి తొలగించేందుకు దేశంలోనే అతిపెద్ద రాజకీయ కుట్రకు బీజేపీ తెరలేపింది. దేశంతో, రాజ్యాంగంతో ఆటలాడుకున్నారు. మోదీ దేశవ్యాప్తంగా 5,000 స్కూళ్లు నిర్మిస్తే , నేను ఢిల్లీలో 500 స్కూళ్లు కట్టా. మీరు (మోదీ) మా మీద ఎన్నో కుట్రలు చేశారు. ఈడీ, సీబీఐ, పోలీసులు, ఐటీ సహా అందరినీ మాకోసం వాడారు. జైలుకు కూడా పంపారు. కేజ్రీవాల్‌ను ఇవేవీ ఆపలేవు. చావు ఒక్కటే ఆపగలదు. ఎందుకంటే నన్ను ఏదీ, ఏమీ చేయలేదు. మోదీకి సత్తా ఉంటే అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్‌కు వ్యతిరేకంగా మాట్లాడాలి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన దగ్గరనుంచి నేను కనిపించడం లేదని చాలా మంది విమర్శిస్తున్నారు. నేను అందరిలాంటి రాజకీయ నాయకుడిని కాదు. నిజాయితీ గల మనిషిని. అందుకే మౌనంగా ఉన్నా. నా నిజాయితీ నిరూపితమైన తర్వాతే మాట్లాడాలని నిశ్చయించుకున్నా" అంటూ కేజ్రీవాల్ మాట్లాడారు. ఆయన వెంట మనీష్ సిసోడియా సహా పలువురు ఆమ్ ఆద్మీ నేతలున్నారు.



లిక్కర్ పాలసీపై ఢిల్లీ కోర్టు తీర్పును అంగీకరించాలి

- అన్నా హజారే

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, ముంబై, ఫిబ్రవరి 27: : లిక్కర్ పాలసీపై ఢిల్లీ కోర్టు ఇచ్చిన తీర్పును అంగీకరించాలని సామాజిక కార్యకర్త అన్నా హజారే అన్నారు. అరవింద్ కేజ్రీవాల్‌కు కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంపై ఆయన స్పందించారు. న్యాయవ్యవస్థ దేశానికి వెన్నెముక లాంటిదని, దాని నిర్ణయాలను గౌరవించాలని స్పష్టం చేశారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ మంత్రి సిసోడియాతో పాటు 23 మందిని నిర్దోషులుగా రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం ప్రకటించింది. మద్యం విధానాన్ని రూపొందించే క్రమంలో అవినీతి జరిగినట్లు వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని పేర్కొంది. కాగా, అరవింద్ కేజ్రీవాల్ రాజకీయ ఎదుగుదలకు ముఖ్యులైన అన్నా హజారే దీనిపై స్పందించారు. న్యాయ, భద్రతా వ్యవస్థల బలం మీద మన దేశం నడుస్తుందని తెలిపారు. విభిన్న పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలతో కూడిన పెద్ద దేశం అయినప్పటికీ, న్యాయవ్యవస్థ కారణంగా అది సజావుగా పనిచేస్తున్నదని చెప్పారు. న్యాయవ్యవస్థ లేకపోతే గందరగోళం, అశాంతి ఏర్పడుతుందని తెలిపారు. 'అరవింద్ కేజ్రీవాల్ తప్పు చేయలేదని పేర్కొంటూ కోర్టు తీర్పు ఇచ్చింది. దానిని అంగీకరించాలి' అని మీడియాతో అన్నారు.

టీవీకే చీఫ్ విజయ్ కు విడాకుల నోటీసిచ్చిన భార్య

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, చెన్నై, ఫిబ్రవరి 27 : తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీవీకే పార్టీ అధినేత, నటుడు విజయ్‌కు భారీ షాక్ తగిలింది. విజయ్ నుంచి విడాకులు కావాలని కోరుతూ ఆయన భార్య సంగీత.. చెంగల్పట్టు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఒక సినీ నటితో విజయ్‌కు వివాహేతర సంబంధమే కారణమని విడాకుల పిటిషన్‌లో సంగీత పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారణకు అంగీకరించిన కోర్టు ఏప్రిల్ 20న కోర్టుకు రావాలని విజయ్‌కు నోటీసులు జారీ చేసింది. నటుడు విజయ్, సంగీత వివాహం 1999లో జరిగింది. విజయ్ ఒక సినీ నటితో వివాహేతర సంబంధం పెట్టుకున్నారని ఆరోపిస్తూ, ఈ కారణంగానే అతడి నుంచి విడాకులు కోరుతున్నట్లు సంగీత తన పిటిషన్‌లో వివరించారు. రెండేళ్లక్రితం విజయ్ రాజకీయాల్లోకి అడుగు పెట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అతడిపై ఇటీవల బీజేపీ నేత తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు నాగేంద్రన్ మాట్లాడుతూ త్రిష ఇంటి నుంచి విజయ్ బయటికి రావాలన్నారు. అయితే, తన వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాలకు వాడుతున్నారని విజయ్ విమర్శించాడు. ఈ అంశంపై త్రిష కూడా స్పందించింది. తన వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాల కోసం వాడుకోకూడదని సూచించింది. దీంతో నాగేంద్రన్ తర్వాత క్షమాపణ చెప్పాడు. దీంతో నెమ్మదిగా ఈ అంశం కనుమరుగైనట్లు అనిపించినా.. తాజాగా విజయ్ భార్య విడాకుల పిటిషన్‌తో ఈ ఎపిసోడ్ మళ్లీ చర్చనీయాంశంగా మారింది. నిజానికి విజయ్ త్రిష మధ్య బంధం గురించి చాలా కాలం నుంచి ప్రచారం జరుగుతోంది. ఇటీవల నాగేంద్రన్ వ్యాఖ్యలు, విడాకుల పిటిషన్ అంశం వీటికి బలం చేకూరుస్తోంది. అయితే, త్వరలో అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పార్టీ టీవీకే పోటీ చేయనున్న నేపథ్యంలో ఈ అంశం అతడి రాజకీయ భవిష్యత్‌పై ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది.







వన్డే సిరీస్ చేజార్చుకున్న వుమెనిండియా

ఆస్ట్రేలియా పర్యటనలో భారత జట్టుకు భారీ షాక్. పొట్టి సిరీస్‌ను పట్టేసిన టీమిండియా వన్డే సిరీస్‌ను చేజార్చుకుంది. తొలి వన్డేలో కంగుతిన్న అమ్మాయిలు.. నిర్ణయాత్మక మ్యాచ్‌లో సర్వశక్తులు ఒడ్డలేకపోయారు. ఓపెనర్ ప్రతీకా రావల్(52), హర్మన్‌ప్రీత్ కౌర్(54)లు కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడినా.. 252 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ అలవోకగా ఛేదించింది. జార్జియా వోల్(101) సెంచరీతో, ఫొబె లిచ్‌ఫీల్డ్(80) హాఫ్ సెంచరీతో విజృంభించగా.. మరో మ్యాచ్ ఉండగానే ఆతిథ్య జట్టు సిరీస్‌ను గెలుపొందింది. విశ్వవిజేతగా తొలి విదేశీ పర్యటనలోనే భారత జట్టు వన్డే సిరీస్ చేజార్చుకుంది. నిరుడు వన్డే వరల్డ్‌కప్ సెమీఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించిన టీమిండియా.. ఈసారి మాత్రం తలొగ్గింది. వరుసగా రెండు మ్యాచుల్లో ఓటమితో సిరీస్‌ను కోల్పోయింది.



కివీస్ ను ఓడించిన ఇంగ్లండ్

- పాక్ సెమీస్ ఆశలు సజీవం

సెమీస్ బెర్తు దక్కాలంటే గెలవక తప్పని మ్యాచ్‌లో న్యూజిలాండ్‌కు గుండెకోతే మిగిలింది. ఆఖరి ఓవర్ వరకూ ఉత్కంఠ రేపిన మ్యాచ్‌ను విల్ జాక్స్(32 నాటౌట్) రెహాన్ అహ్మద్(19 నాటౌట్)లు సంచలన ఆటతో ఇంగ్లండ్ వైపు తిప్పారు. ప్రధాన బ్యాటర్లను ఔట్ చేసి గెలుపుపై ధీమాతో ఉన్న కివీస్‌కు షాకిస్తూ ఈ ద్వయం.. రెండు ఓవర్లలోనే 38 రన్స్ రాబట్టి బ్లాక్ క్యాప్స్ సెమీస్ చేరకుండా అడ్డుపడ్డారు. తద్వారా పాకిస్థాన్‌కు కూడా తలుపులు తెరిచే ఉన్నాయి. పొట్టి ప్రపంచకప్ నాకౌట్ దశను ఇంగ్లండ్ అజేయంగా ముగించింది. శ్రీలంక, పాకిస్థాన్‌ను చిత్తు చేసి సెమీస్ బెర్తు పట్టేసిన ఇంగ్లండ్ చివరి మ్యాచ్‌లోనూ న్యూజిలాండ్‌కు పంచ్ ఇచ్చింది. ప్రేమదాస మైదానంలో ఉత్కంఠ రేపిన పోరులో హ్యారీ బ్రూక్ సేన జయభేరి మోగించింది. గ్లెన్ ఫిలిప్స్ వేసిన 18వ ఓవర్లో విల్ జాక్స్(32 నాటౌట్), రెహాన్ అహ్మద్(19 నాటౌట్)లు 22 రన్స్ రాబట్టి మ్యాచ్‌ను కివీస్ నుంచి లాగేసుకున్నారు. 4 వికెట్ల తేడాతో గెలుపొందిన ఇంగ్లండ్ గ్రూప్ బీలో రెండో సెమీస్ బెర్తు రేసును ఆసక్తికరంగా మార్చేసింది. కివీస్ నిర్దేశించిన 160 పరుగుల ఛేదనలో ఇంగ్లండ్ ఓపెనర్లు ఫిల్ సాల్ట్(2), జోస్ బట్లర్(0)లు విఫలమయ్యారు. జాకబ్ బెథెల్(21) జతగా హ్యారీ బ్రూక్(26) దూకుడు పెంచగా.. పవర్ ప్లేలో 47 రన్స్.. వచ్చాయి. శాంట్నర్ కట్టడి చేస్తుండడంతో గ్లెన్ ఫిలిప్స్ ఓవర్లో పెద్ద షాట్‌కు యత్నించిన బ్రూక్ బౌండరీ లైన్‌వద్ద దారిల్ మిచెల్ చేతికి దొరికాడు. కాసేపటికే రచిన్ రవీంద్ర ఓవర్లో బెథెల్ డీప్ మిడ్ వికెట్ దిశలో కొట్టిన బంతిని ఫిలిప్స్ గాల్లోకి డైవ్ చేస్తూ అందుకున్నాడు. దాంతో.. 58 వద్ద నాలుగో వికెట్ కోల్పోయింది ఇంగ్లండ్. ఐదో వికెట్‌కు కీలక భాగస్వామ్యంలో ఇంగ్లండ్‌ను గెలుప దిశగా నడిపిస్తున్న టామ్ బ్యాంటన్(39), సామ్ కరన్(24)ల జోడీని రచిన్ విడదీశాడు. సామ్ కరన్ నేరుగా ఫిలిప్స్ చేతుల్లోకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగడంతో 42 రన్స్ భాగస్వామ్యానికి తెరపడింది.




తండ్రికి కన్నీటీ వీడ్కోలు పలికిన రింకూ సింగ్

టీ20 ప్రపంచకప్ మధ్యలోనే చేదు వార్తను విన్న భారత క్రికెటర్ రింకూ సింగ్ తన తండ్రికి కన్నీటి వీడ్కోలు పలికాడు. క్యాన్సర్‌తో పోరాడి కన్నుమూసిన తండ్రి ఖంచంద్ సింగ్ అంత్యక్రియల్లో రింకూ పాల్గొన్నాడు. తనను క్రికెటర్‌గా చూసేందుకు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చిన నాన్నను ఇంకొన్నాళ్లు బతికించుకోలేక పోయాననే బాధతో అతడు కుమిలిపోయాడు. పాడె మోస్తూ తండ్రి తమకోసం పడిన బాధల్ని.. గుర్తు చేసుకున్న భారత స్టార్ మౌనంగా రోదించాడు. పొట్టి ప్రపంచకప్ సమయంలో భారత ఆటగాడు రింకూ సింగ్ ఇంట్లో విషాదం నెలకొంది. గత కొంతకాలంగా కాలేయం క్యాన్సర్‌తో బాధ పడుతున్న అతడి తండ్రి ఖంచంద్ సింగ్ మరణించాడు. సూపర్ 8లో జింబాబ్వేతో కీలకమైన మ్యాచ్‌కు ముందే ఆయన ఆరోగ్యం విషమించింది. గ్రేటర్ నోయిడాలోని యథార్థ్ ఆస్పత్రిలో ఆయనను చేర్పించారనే విషయం తెలిసిన రింకూ.. అత్యవసరంగా జట్టును వీడాడు. ఆరోగ్యం కాస్త మెరుగ్గా అనిపించిందంతో అతడు గురువారం మళ్లీ స్క్వాడ్‌తో కలిశాడు.అయితే.. జింబాబ్వేపై 72 వికెట్ల విజయంతో సెమీస్ ఆశలు నిలిచిన సంతోషంలో ఉండగానే తండ్రి మరణ వార్త రింకూ చెవిన పడింది. దాంతో.. చెపాక్ నుంచి హుటాహుటిన అలీగఢ్ వెళ్లిన రింకూ.. శుక్రవారం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. రింకూ సింగ్ తండ్రి మృతిపట్ల భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ.. క్రికెటర్లు శిఖర్ ధావన్, ఇర్ఫాన్ పఠాన్‌లు సంతాపం తెలిపారు. ఈ పరిస్థితుల్లో సెమీస్ లక్ష్యంగా భారత జట్టు మార్చి 1న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో వెస్టిండీస్‌తో తలపడనుంది. తప్పక గెలవాల్సిన మ్యాచ్‌కు ఈ చిచ్చరపిడుగు అందుబాటులో ఉంటాడా? లేదా? అనేది తెలియాల్సి ఉంది.

ఐపీఎల్ ప్రారంభ తేదీ మార్పు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ తేదీపై ఉత్కంఠ కొనసాగుతోంది. అబూ ధాబీలో వేలం ముగిసి మూడు నెలలు కావొస్తున్నా ఇంకా బీసీసీఐ నుంచి షెడ్యూల్ ప్రకటన రాలేదు. ఆనవాయితీ ప్రకారం మార్చి - మే నెల మధ్యలో మెగా టోర్నీ జరగాలి. ఈసారి కూడా అదే సంప్రదాయం పాటించే అవకాశముంది. అయితే.. ఇదివరకూ చెప్పినట్టు మార్చి 26న కాకుండా మరో రెండు రోజులు ఆలస్యంగా మెగాటోర్నీ ప్రారంభమవుతుందని వార్తలు వినిపిస్తున్నాయి. త్వరలోనే నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికల నేపథ్యంలోనే ఐపీఎల్ 19వ సీజన్ షెడ్యూల్ ప్రకటన ఆలస్యం అవుతోంది. కేరళ, అస్సాం, బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా సీజన్ ఆరంభంపై బీసీసీఐ ఆలోచనలో పడింది. ఆ రాష్ట్రాల్లో ఎన్నికలపై కేంద్ర ఎన్నికల సంఘం తేదీలు ప్రకటించగానే.. ఐపీఎల్ తేదీలను ఖరారు చేయాలని బీసీసీఐ భావిస్తోంది. 2019లోలోనూ ఇదే సమస్య ఎదురైంది. అప్పుడు పూర్తిస్థాయిలో కాకుండా కొన్ని మ్యాచ్‌లకే షెడ్యూల్ వెల్లడించింది. ఈసారి కూడా అదే పంథాను అనుసరించాలని బీసీసీఐ కసరత్తు చేస్తోంది. అయితే.. వేలం సందర్భంగా చూచాయగా పేర్కొన్నట్టు మార్చి 26వ తేదీన కాకుండా.. మరో రెండు రోజులు ఆలస్యంగా టోర్నీ షురూ కానుంది. అంటే.. అంటే మార్చి 28న వేసవి వినోదంగా ఐపీఎల్ సందడి మొదలవ్వనుంది. ఒకవేళ.. ఈ రోజున కాదంటే.. మార్చి 29. ఈ రెండు తేదీల్లో ఒకటి ఖరారు అవుతుందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.






తెలంగాణ కళలను ప్రపంచానికి తెలిసేలా చేయాలి

- 'తెలంగాణ సినీ ప్రస్థానం' పుస్తక రచనతో పొన్నం రవిచంద్ర గొప్ప ప్రయత్నం చేశారు
- ప్రముఖ రచయిత, రాజ్యసభ సభ్యులు కేవీ విజయేంద్రప్రసాద్
- ఘనంగా "తెలంగాణ సినీ ప్రస్థానం" పుస్తక పరిచయ సభ

ప్రతిపక్షం, సిటీ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 27: తెలంగాణలో ఎన్నో కళలు ఉన్నాయని, ఎంతోమంది గొప్ప కళాకారులు ఉన్నారని, వారి ప్రతిభ ప్రపంచానికి తెలిసేలా చేస్తే చాలా బాగుంటుందని ప్రముఖ రచయిత, రాజ్యసభ సభ్యులు కేవీ విజయేంద్రప్రసాద్ అన్నారు. తెలంగాణ సినీ ప్రస్థానం పుస్తక రచనతో పొన్నం రవిచంద్ర గారు ఒక గొప్ప ప్రయత్నం చేశారని, అలాగే ఆ సినిమాలను తిరిగి మన ప్రేక్షకులు చూసేలా కూడా ఆయన ప్రయత్నం చేయాలని కోరుతున్నానని ఆయన అన్నారు. మన తెలుగు సాంస్కృతిక చరిత్రకు చిహ్నంగా మారిన రవీంద్ర భారతిలో కనీస సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నానని అన్నారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో డాక్టర్ పొన్నం రవిచంద్ర రచించిన "తెలంగాణ సినీ ప్రస్థానం" పుస్తక పరిచయ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నాగర్ కర్నూల్ అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ ఐఏఎస్ సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ప్రముఖ రచయిత, రాజ్యసభ సభ్యులు కేవీ. విజయేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా, దర్శక నిర్మాత వేణు ఊడుగుల ఆత్మీయ అతిథిగా, ప్రముఖ సినీ జర్నలిస్ట్ ప్రభు, దర్శకులు అల్లాణి శ్రీధర్, సినీ పుస్తక రచయిత ఎస్ వీ రామారావు, రచయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మి విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. "తెలంగాణ సినీ ప్రస్థానం" పుస్తకాన్ని ప్రముఖ రచయిత మామిడి హరికృష్ణకు అంకితమిచ్చారు. ఈ కార్యక్రమంలో సినీ పుస్తక రచయిత ఎస్.వి.రామారావు మాట్లాడుతూ 1913 నుంచి ప్రారంభమైన దేశ సినీ చరిత్రకు మూకీ నుంచి టాకీ వరకు గొప్ప చరిత్ర ఉన్నదని అన్నారు. ఒక మహిళ గర్భం దాల్చి తొమ్మిది నెలలు ఎలా అయితే కష్టపడుతుందో పుస్తక రచయిత కూడా అలాగే కష్టపడతాడని అన్నారు. సీనియర్ జర్నలిస్టు, విద్యావేత్త,



మాజీ కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ డాక్టర్ పొన్నం రవిచంద్ర అద్భుతమైన పుస్తకాన్ని రచించారని, పుస్తకంలోని విషయాలను ఇప్పుడు చదవకపోయినా, భవిష్యత్తులో అందరూ చదువుతారని, తెలంగాణ సినిమా చరిత్ర గురించి సమగ్రంగా తెలిపారని అన్నారు. దర్శకుడు వేణు ఊడుగుల మాట్లాడుతూ తెలంగాణ సినిమా చరిత్రను సమగ్రంగా ఇంత పరిశోధనాత్మకంగా, మా తారం డైరెక్టర్లు, తరువాతి తరం వారు అందరూ తెలుసుకోవడానికి అనుకూలంగా చాలా సరలమైన భాషలో ఇంత చరిత్రని ఒక చోట భద్రపరచడం చాలా గొప్ప విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత పొన్నం రవిచంద్ర మాట్లాడుతూ 'మాది కరీంనగర్ జిల్లా. చిన్నప్పటి నుంచి పుస్తక పఠనం, సినిమాల మీద ఆసక్తి ఉండేది. మా సొంత బుక్ స్టాల్ కోసం అనేక సినిమా పత్రికలు తీసుకునేవాళ్లం. ఆ పత్రికల్లో సినిమా వార్తలు చదువుతూ, వాటి పేపర్ కటింగ్స్ భద్రపరిచాను. అప్పుడే పైడి జయరాజ్ గురించి తెలుసుకున్నాను. నేను సేకరించిన సినీ సమాచారంతో 80 ఏళ్ల తెలుగు సినీ ప్రస్థానం పుస్తకాన్ని ప్రచురించాను. ఆ పుస్తకానికి ఉమ్మడి ఏపీ ప్రభుత్వంలో నంది పురస్కారం దక్కింది. ఇప్పుడు తెలంగాణ సినీ ప్రస్థానం పుస్తకాన్ని తీసుకురావడం సంతోషంగా ఉంది. నాకు సినిమా జర్నలిజంలో గురువులా భావించే మామిడి హరికృష్ణకు ఈ పుస్తకాన్ని అంకితమిస్తున్నా. తెలంగాణ ప్రాంత సినిమా గురించి ఇప్పుడు మాట్లాడుకుంటున్నారు గానీ పైడి జయరాజ్ , ఆయనకు ముందు నుంచే చాలామంది తెలంగాణ ప్రాంత నటీనటులు, సాంకేతిక నిపుణులు సినిమా ఇండస్ట్రీలో ఎంతో ప్రతిభ చాటారు. ఇప్పుడు మన టాలీవుడ్ లో ఉన్న టాప్ డైరెక్టర్స్ లో కనీసం పది మంది తెలంగాణ వారు ఉండటం విశేషం.' అని అన్నారు. ప్రముఖ సినీ జర్నలిస్ట్ ప్రభు మాట్లాడుతూ పొన్నం రవిచంద్ర తెలంగాణ సినీ ప్రస్థానం పుస్తక రచనతో ఒక గొప్ప ప్రయత్నం చేశారని అన్నారు. ఈ పుస్తకాన్ని మామిడి హరికృష్ణ కు అంకితమివ్వడం సముచితం అని అన్నారు. సినిమా పరిశ్రమకు తెలంగాణ, ఏపీ అనే బేధం లేదని, ప్రతిభావంతులు ఎక్కడున్నా సినీ పరిశ్రమ ఆదరిస్తుంది, అక్కున చేర్చుకుంటుందని అన్నారు. ప్రముఖ రచయిత మామిడి హరికృష్ణ మాట్లాడుతూ తెలంగాణ సినిమా గురించి ఎంతో సమాచారాన్ని పొన్నం రవిచంద్ర ఈ పుస్తకం ద్వారా తెలియజేసే ప్రయత్నం చేయడం అభినందనీయం అని అన్నారు. ఆయన నాకు ఈ పుస్తకాన్ని అంకితమివ్వడం గౌరవంగా భావిస్తున్నానని, పొన్నం కుటుంబంతో నాకు ఎంతో అనుబంధం ఉందని అన్నారు. తెలంగాణ సినీ ప్రస్థానం పుస్తకంలోని సమాచారం ఎంతో విలువైనదని, చాలా విషయాలు తెలుసుకునేలా చేసిందని అల్లాణి శ్రీధర్, ఇతర అతిథులు ప్రశంసించారు. అనంతరం ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డుని డా. హరికుమార్, డా. పావని, వివేక్ లు రవిచంద్ర కు అందించగా విజయేంద్రప్రసాద్ అభినందనలు తెలిపారు. నాగర్ కర్నూల్ అదనపు కలెక్టర్ జీవీ. శ్యాంప్రసాద్ లాల్ అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్, సినీ పుస్తక రచయిత ఎస్.వి. రామారావు, సినీ జర్నలిస్ట్ ప్రభు, రచయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మి, ప్రకాష్ రెడ్డి, సి వి నవీన్ కుమార్, కత్తి చేతన్, గౌని తిరుపతి, ఉదయ్, పోల్సాని వేణు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.







Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200